




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 81 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం శనివారం 4 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 81 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM SAT 4 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## అమరావతిపై చంద్రబాబు మాట తప్పారు

- అమరావతిని రెండేళ్లలో పూర్తి చేస్తానని చంద్రబాబు చెప్పారన్న శ్రీకాంత్ రెడ్డి
- ఇప్పుడు అది నిరంతర ప్రక్రియ అంటున్నారని విమర్శ
- జగన్ తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపాటు

మిగతా 2లో

## మరింత చమురు కావాలా... మేం సరఫరా చేస్తాం!

### భారత్‌కు రష్యా ఓపెన్ ఆఫర్



- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌కు రష్యా కీలక ఆఫర్
- చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాను పెంచేందుకు సిద్ధమని వెల్లడి
- రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ భారత పర్యటనలో చర్చలు
- ఇటీవల తగ్గిన దిగుమతులు మళ్లీ పెరిగే అవకాశం
- భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇచ్చే పరిణామం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న వేళ, భారత్‌కు రష్యా కీలకమైన ప్రతిపాదన చేసింది. దేశీయ అవసరాల కోసం క్రూడ్ ఆయిల్, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్ జీ) సరఫరాను మరింత పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా

మిగతా 2లో



## మాపై వివక్ష చూపారు

### ఉపరాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు

- అమరావతికి చట్టబద్ధత బిల్లును ఆమోదించిన పార్లమెంట్
- రాజ్యసభలో తమకు 5 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారన్న వైసీపీ ఎంపీలు
- అమరావతి రైతులకు జరిగే న్యాయంపై బిల్లులో స్పష్టత లేదని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:**రాజధాని అమరావతి బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని వైసీపీ ఎంపీలు ఆరోపించారు. రాజ్యసభలో తమ పార్టీకి ఏడుగురు ఎంపీలు ఉన్నప్పటికీ, కేవలం 5 నిమిషాలు మాత్రమే సమయం

మిగతా 2లో


## ఇరాన్ గడ్డపై కూలిన ఎఫ్-35...

### పైలట్ ను కాపాడేందుకు అమెరికా విఫలయత్నాలు?

- ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-35 పైలట్ కోసం అమెరికా గాలింపు
- బ్లాక్ హాక్ హెలికాప్టర్లతో వెదుకులాట.. విఫలమైన ప్రయత్నాలు
- అమెరికా పైలట్‌ను ఇరాన్ దళాలు అదుపులోకి తీసుకున్నట్టు కథనాలు
- రెండో అమెరికా ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్టు ప్రకటించిన ఇరాన్
- గత వారం కూడా ఎఫ్-16, డ్రోన్‌ను కూల్చివేసినట్లు తెలిపిన ఐఆర్‌జీసీ

మిగతా 2లో







## కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త...

### సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక

- కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో జాగ్రత్తగా ఉండాలని సజ్జనార్ హెచ్చరిక
- కాల్షియం కార్బైడ్ వాడకం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలని వెల్లడి
- సహజ, కల్తీ పండ్ల మధ్య తేడాలను గుర్తించాలని ప్రజలకు సూచన
- కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతున్నామన్న హైదరాబాద్ పోలీసులు
- సమాచారం ఉంటే డయల్ 100 లేదా హెచ్-ఫాస్ట్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి

మిగతా 2లో

## వాళ్లు నాశనం చేశారు... మేము శాసనం చేశాం

- ఏపీ ప్రజలకు ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ అంటూ చంద్రబాబు విమర్శలు
- 11 సీట్లకు పరిమితమైనా వైసీపీకి బుద్ధి రాలేదని మండిపాటు
- తెలంగాణ కు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**రాజధాని అమరావతికి పార్లమెంట్ ఆమోదం దక్కడం చారిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఈ బిల్లుకు మద్దతు తెలపడం విశేషమని, రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీయేనని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని చూసిందని, కానీ తాము అదే అమరావతిని రాజధానిగా చేస్తూ శాసనం చేశామని సీఎం గర్వంగా ప్రకటించారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తూనే... విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. విభజన సమయంలో కూర్చోవడానికి కార్యాలయం కూడా లేని పరిస్థితి నుంచి, నేడు ఒక సుస్థిర రాజధానిని నిర్మించుకోగలిగామని గుర్తుచేసుకున్నారు. 11 సీట్లకు పరిమితమైనా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని చంద్రబాబు మండిపడ్డారు. రాజధానిని నిర్ణయించే అధికారం పార్లమెంటుకు లేదనడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. సైబరాబాద్ అభివృద్ధి సమయంలోనూ ఇలాగే విమర్శలు వచ్చాయని, కానీ నేడు అది హైదరాబాద్‌కే తలమానికంగా మారిందని ఉదాహరణగా చెప్పారు. సింగపూర్ వంటి సంస్థలపై అవినీతి ఆరోపణలు చేసి రాష్ట్రం నుంచి గత వైసీపీ ప్రభుత్వం తరిమేయడం దారుణమని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయినా, తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రానికి 9 ఏళ్లు సీఎంగా పనిచేసిన అనుభవంతో, రెండు రాష్ట్రాల ప్రజల కోసమే హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని చెప్పారు. తెలంగాణ ప్రజల గౌరవాన్ని తగ్గించే పని తానెప్పుడూ చేయనని, వారి పట్ల ఎల్లప్పుడూ గౌరవంతో ఉంటానని తెలిపారు.



## అమరావతికి 200 ఏళ్లు పడుతుంది

### చంద్రబాబుపై రాచమల్లు విమర్శలు

- 2014లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు దోపిడీకే పరిమితం అయిందన్న రాచమల్లు
- బంగారు పండించే 50 వేల ఎకరాలను దుర్మార్గంగా లాక్కున్నారని మండిపాటు
- అమరావతి కోసం గత ఏడేళ్లలో చంద్రబాబు రూ. 80 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారని వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవతల రాజధాని నిర్మిస్తామంటూ 2014లో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు కేవలం భూ దోపిడీకే పరిమితమైందని ఆయన ఆరోపించారు. బంగారు పండించే 50 వేల ఎకరాల భూములను రైతుల నుంచి దుర్మార్గంగా లాక్కున్నారని మండిపడ్డారు. రెండు లక్షల కోట్ల వ్యయంతో లక్ష ఎకరాల్లో నిర్మాణం చేపడతామన్న బాబు, గత ఏడేళ్లలో కేవలం 80 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ఇదే వేగంతో వెళితే రాజధాని పూర్తి కావడానికి 200 ఏళ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెప్పి, ఇప్పటికే వేల కోట్లు

మిగతా 2లో



### స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా

## చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

- వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ
- ప్రైవేటుగా అభివృద్ధి చేసిన తియాన్‌లాంగ్3 ప్రయోగం
- సాంకేతిక లోపం కారణంగా నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లో విఫలం

మిగతా 2లో

## ఇంత జరిగినా జగన్ తీరు మారలేదు

- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి జగన్ జై కొట్టారన్న గంటా
- అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర భవిష్యత్తును వెనక్కి నెట్టారని మండిపాటు
- ఏప్రిల్ 15లోపు గూగుల్ సంస్థకు శంకుస్థాపన ఉంటుందని వెల్లడి

మిగతా 2లో




## కొండాపూర్ పబ్‌పై ఈగల్ టీమ్ దాడులు ..

## 8 మందికి డ్రగ్స్ పాజిటివ్..

- క్వాక్ ఎరీనా పబ్‌పై పోలీసుల దాడి
- 64 మందికి అక్కడికక్కడే పరీక్షలు
- ఆ సమయంలో పబ్‌లోనే ఉన్న హేమ
- నటి హేమకి టెస్ట్‌లు..
- డ్రగ్స్ టెస్టులో తనకు నెగెటివ్ వచ్చిందని వెల్లడి

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# టు లెట్‌లోనూ కుల సంస్కృతి

ప్రపంచం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతోంది, ప్రపంచ దేశాల మధ్య అభివృద్ధిలో పోటీ సాగుతుంది, ప్రపంచం మొత్తం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లో పురోగతి ఆడిస్తుంటే మన దేశం కుల పిచ్చిలో పోటీ పడుతోంది, ఆధునిక కాలంలో కూడా అనేక చోట్ల కుల దురహంకారాలు కొనసాగుతూనే ఉంటాయి. వేల సంవత్సరాల క్రితం వేద కాలపు వర్ణ వ్యవస్థలో కుల వివక్ష ఉండేది, వీటి పైన అనేక సంఘసంస్కర్తలు ఉద్యమించి కొంత అవగాహన తీసుకువచ్చాక సమాజంలో కొంత మార్పు వచ్చింది. భారతదేశానికి స్వతంత్రం వచ్చినాక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ రచన కమిటీ ఏర్పడింది, ఈ రాజ్యాంగ కమిటీ దేశంలో ఉన్న ప్రజలందరూ సమానమనీ, ఎలాంటి కుల మత లింగ ధనిక పేద వివక్ష ఉండరాదు అని తెలియజేస్తూ రాజ్యాంగాన్ని రూపొందించింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచినా దేశంలో కుల వివక్ష అనేది కొనసాగుతూనే ఉంది, గతంలో నగరాల్లో కానీ పట్టణంలో కానీ రూముల అద్దె కోసం వెళితే అన్ని వివరాలు చెప్పిన తర్వాత, మీ పేరేంటి మీరు ఏం పని చేస్తారూ మీది ఎక్కడ అంటూ ప్రశ్నలు సంధిస్తూ కులాన్ని వెతికేవారు, అయినా స్పష్టత రాకపోతే మీరు ఏ కులం అంటూ అడిగేవారు. పలాన కులం అనగానే మొహం మీదే నిరాకరించే వారు. గతంలో సమాజంలో అవగాహన లేక అసమానతలు, కుల వివక్షలు కొనసాగాయి అనుకుంటే, నేటి తరంలో కూడా కులం ఆధారంగా రూములు అద్దె ఇవ్వటం చూస్తుంటే భారత దేశం ఎటు పోతోంది అని విచారమేస్తుంది, టూ లెట్‌లో కుల సంస్కృతి ఈ మధ్య మళ్ళీ దర్శనిస్తోంది. పట్టణంలో ఒక యజమాని టూ లేట్ బోర్డ్ పెట్టటమే కాకుండా దాంట్లో పలాన మతం, కులం వారికి మాత్రమే అంటూ పేర్కొనటం విడ్డూరం, దాంట్లో హిందువులు మాత్రమే అని అనటం హిందువులలో నో ఎస్సీ, ఎస్టీ అని పెట్టటం ఎంత దుర్మార్గం, ఇది ఒక వర్గం వారిని అవమానించటమే. ఎస్సీ ఎస్టీలు హిందూ మతంలో భాగమే. ఇళ్లు హిందూ మతం వారికే అన్నప్పుడు వీళ్లూ హిందువులే కదా అద్దెకు ఎందుకు నిరాకరిస్తున్నారు నో ఎస్సీ, ఎస్టీ అని పెట్టటం అంటే వారు హిందువులు కారు అనటమే అవుతుంది. దీన్ని బట్టి దేశంలో ఇంకా కుల వివక్ష అనేది పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు అని స్పష్టంగా కనిపిస్తుంది, ఇంటి యజమానికి కూడా భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది, కానీ బావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)జీ ) అనేది హద్దు మీరకూడదు కదా. రాజ్యాంగం ఏం చెబుతోంది అంటే కుల జాతి వివక్షలను వ్యక్తపరచడం నేరంగా భావిస్తుంది, ఇలా బహిరంగంగా ఎస్సీ ఎస్టీలకు ఇవ్వం అని వ్యక్తపరచడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు, ఎస్సీ ఎస్టీలు ఇక్కడ పుట్టి పెరిగిన భారతీయ హిందువులే కదా, ఎక్కడో వేరే దేశంలో ఉన్న హిందువుల పైన దాడిని ఖండిస్తూ సానుభూతి తెలియజేసే వారు, ఈ దేశ ఎస్సీ ఎస్టీ హిందువుల పైన కుల వివక్ష చూపించడం సమంజసమా మన తోటి వారిని మనమే అవమానించుకుంటూ మళ్లీ వేద కాలంలోకి వెళ్దామా! ఇలా వివక్షలు కొనసాగుతూ ఉంటే దేశం ఎలా పురోగతి సాధిస్తుంది? ఎలాంటి వివక్షలు లేని సమాజాన్ని నిర్మించడంలో అందరూ భాగస్వాములు అవ్వాలి, అందరూ సమానమనే అవగాహనతో ఇలాంటి కుల ఆధారిత వివక్షలను అరికట్టాలి. అందరం ఒకటే అనే భావన కలగాలి.

# ఇంత జరిగినా జగన్ తీరు మారలేదు

పార్లమెంట్ సాక్షిగా అమరావతికి రాజధానిగా చట్టబద్ధత లభించడాన్ని స్వాగతిస్తూ మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి జై కొట్టిన జగన్, అధికారం రాగానే మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర భవిష్యత్తును ఐదేళ్లు వెనక్కి నెట్టారని విమర్శించారు. 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోయినా జగన్ తీరు మారలేదని, కనీసం రాజధాని తీర్మానం కోసం జరిగిన అసెంబ్లీ సమావేశానికి కూడా ఆయన హాజరుకాకపోవడం దారుణమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని గంటా అన్నారు. ఏప్రిల్ 15లోపు ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ సంస్థకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఉండబోతోందని ఆయన ఒక కీలక సమాచారాన్ని వెల్లడించారు. అమరావతి, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ఐటీ రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఆమోదం లభించడంతో ఇకపై ఎవరూ అమరావతిని కదిలించలేరని, ఇది ఆంధ్రుల కలల రాజధానిగా అభివృద్ధి చెందుతుందని గంటా స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు రైతులు చేసిన పోరాటం వృథా కాలేదని, చివరకు న్యాయమే గెలిచిందని ఆయన పేర్కొన్నారు.

# అమరావతిపై చంద్రబాబు మాట తప్పారు

రాజధానిపై చంద్రబాబు మాట మారుస్తున్నారని వైసీపీ నేత శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. అమరావతిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్న వ్యక్తి, ఇప్పుడు అది 'నిరంతర ప్రక్రియ' అనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీలు అమరావతిని రాజధానిగా చెప్పలేదని, కేవలం ఇన్సైడర్ ట్రేడింగ్ కోసమే చంద్రబాబు కమిటీల పేర్లు వాడుతున్నారని ఆరోపించారు.
అమరావతిని 'దేవతల రాజధాని' అంటున్న బాబు, పరమశివుడు తిరుగాడిన కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులను తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ భవనం చదరపు అడుగు రూ. 4 వేలకు కడితే, అమరావతిలో రూ. 12 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం ఉన్న నగరాలను ఈ సొమ్ముతో అభివృద్ధి చేస్తే ఎంతో సంపద సృష్టించేవాళ్లమన్నారు. విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రైవేటు సంస్థల కోసం వెంపర్లాడే బాబు, జగన్ తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు.
మిగతా రాష్ట్రాల్లాగే మనకూ ఒక మంచి నగరం ఉండాలని వైజాగ్ గురించి జగన్ చెబితే నానా యాగీ చేశారని విమర్శించారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం వంటి నగరాలను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా చంద్రబాబు పట్టించుకోలేదని మండిపడ్డారు. చట్టబద్ధత పేరుతో అమరావతిని కేంద్రం చేతుల్లో పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారని మండిపడ్డారు.

# ఇరాన్ గడ్డపై కూలిన ఎఫ్-35...

## పైలట్ ను కాపాడేందుకు అమెరికా విఫలయత్నాలు?

ఇరాన్ గగనతలంలో తమ ఎఫ్-35 ఫైటర్ జెట్ కూలిపోవడంతో, అందులోని పైలట్‌ను కాపాడేందుకు అమెరికా ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ఇరాన్ మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. పశ్చిమ ఇరాన్‌లోని కోగిలుయే, బోయర్-అహ్మద్ ప్రావిన్సులలో అమెరికా దళాలు శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపింది. బ్లాక్ హాక్ హెలికాప్టర్లు, సీ-130 హెర్క్యులస్ విమానాలతో గాలిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు వారి ప్రయత్నాలు ఫలించలేదని ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. సెంట్రల్ ఇరాన్‌లో తమ అధునాతన రక్షణ వ్యవస్థతో అమెరికాకు చెందిన రెండో ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) శుక్రవారం ప్రకటించింది. లేకెన్‌హీత్ స్క్వాడ్రన్‌కు చెందిన ఈ యుద్ధ విమానం పూర్తిగా ధ్వంసమై కూలిపోయిందని తెలిపింది. అయితే, దాడి నుంచి తప్పించుకున్న పైలట్ పారాచూట్ సాయంతో ఇరాన్ భూభాగంలోనే ల్యాండ్ అయినట్లు సమాచారం. పైలట్ బతికే ఉంటాడని భావిస్తున్న అమెరికా, అతడిని ఇరాన్ సరిహద్దుల నుంచి బయటకు తీసుకురావాలని చూస్తోందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఆ పైలట్‌ను ఇరాన్ సైనిక దళాలు ఇప్పటికే అదుపులోకి తీసుకుని ఉండవచ్చని కొన్ని వర్గాలు చెబుతున్నట్లు తస్నిమ్ తన కథనంలో పేర్కొంది.
గత వారం కూడా ఓ అమెరికా ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించడం తెలిసిందే. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తుండగా, ఇరాన్, దాని మిత్రపక్షాలు కూడా మధ్యప్రాచ్యంలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై ప్రతిదాడులకు దిగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది.

# కొండాపూర్ పబ్‌పై ఈగల్ టీమ్ దాడులు ..

# 8 మందికి డ్రగ్స్ పాజిటివ్..

నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొండాపూర్‌లోని 'క్వాక్ ఏరీనా పబ్'పై ఈగల్ టీమ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలు పబ్‌లో ఉన్నవారందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. పబ్‌లో పార్టీ జరుగుతున్న సమయంలో ఎంట్రీ ఇచ్చిన పోలీసులు, అనుమానం ఉన్న సుమారు 64 మందికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం 8 మందికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ అని తేలింది. వీరిలో ఆరుగురు గంజాయి సేవించగా, మరో ఇద్దరు ఇతర రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే నిందితులందరినీ అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
ఈ పార్టీలో టాలీవుడ్ సీనియర్ నటి హేమ కూడా పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. పబ్‌పై దాడి జరిగిన సమయంలో ఆమె అక్కడ ఉండటంతో రకరకాల ప్రచారాలు జరిగాయి. దీనిపై ఆమె తక్షణమే స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను
విడుదల చేశారు. "నాకు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చింది. నేను ఏ తప్పూ చేయలేదు. దయచేసి నాపై అనవసరంగా దుష్ప్రచారం చేయవద్దు" అని ఆమె ఆ వీడియోలో స్పష్టం చేశారు. మరోవైపు, నగరంలోని పబ్‌ల యజమానులు నిబంధనలు అతిక్రమించినా, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పబ్‌లలో సీసీ కెమెరాల నిఘాతో పాటు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

# కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త...

వేసవి వచ్చిందంటే చాలు, పండ్లలో రారాజైన మామిడి పండ్ల కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, మార్కెట్లో కంటికి ఇంపుగా కనిపించే ఈ పండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు కీలక సూచనలు చేశారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, కేవలం కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా కాకుండా, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన నిగనిగలాడుతూ, ఒకే రకమైన పసుపు పచ్చ రంగులో ఆకర్షణీయంగా కనిపించే పండ్లను చూసి మోసపోవద్దని సూచించారు. సహజంగా పండిన పండు అన్నిచోట్లా ఒకే రంగులో ఉండదని, కానీ రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండు పైన పసుపుగా ఉన్నా లోపల పచ్చిగా, రుచిహీనంగా ఉంటుందని వివరించారు. ఇలాంటి కల్తీ పండ్లను తినడం ప్రాణాంతకం కాగలదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. వీటిని తినడం వల్ల తక్షణమే గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ రసాయనాలు శరీరంలోకి చేరడం వల్ల దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తవచ్చని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కల్తీ వ్యాపారాలపై హైదరాబాద్ పోలీస్ విభాగం ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల రూపాన్ని చూసి కాకుండా, సహజత్వాన్ని గమనించి కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసాధారణ రంగు, రసాయన వాసన, వింత రుచి ఉన్న పండ్లకు దూరంగా ఉండాలన్నారు.
ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, హెచ్-ఫాస్ట్ వాట్సాప్ నంబర్ 8712661212కు గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

# అమరావతికి 200 ఏళ్లు పడుతుంది

- మొదటి పేజి తరువాయి

అప్పులు చేశారని, చదరపు అడుగుకు రూ. 4 వేలు ఖర్చయ్యే చోట రూ. 14 వేలు చూపిస్తూ నిధులు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణం కేవలం బేతాళ కథల వంటిదని, చంద్రబాబు హయాంలో ఇది ఎప్పటికీ పూర్తి కాదని రాచమల్లు స్పష్టం చేశారు.

# స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

చైనా సొంతంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయోగం విఫలమైంది. దీనితో వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాం లాంగ్-3 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైంది. ఇది నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్లు సంబంధిత సంస్థ తెలిపింది. బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ 'స్పేస్ ఎక్స్' ఫాల్కన్9కు పోటీగా ఈ భారీ రాకెట్‌ను అభివద్ధి చేసింది. దీనిని ఈరోజు డాంగ్‌ఫెంగ్ కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించగా, నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే విఫలమైంది. ఇది ఫెయిల్ కావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు స్పేస్ పయనీర్ వెల్లడించింది. తదుపరి మిషన్ విజయవంతమయ్యేలా కృషి చేస్తామని తెలిపింది.

# మరింత చమురు కావాలా... మేం సరఫరా చేస్తాం!

- మొదటి పేజి తరువాయి

సీతారామన్‌లతో మంటురోవ్ సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా భేటీ అయ్యారు. ఈ చర్చల్లో ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారం ప్రధాన అంశంగా నిలిచింది. "భారత మార్కెట్‌కు స్థిరంగా చమురు, ఎల్ఎన్జీ సరఫరాను పెంచే సత్తా తమ కంపెనీలకు ఉంది" అని మంటురోవ్ స్పష్టం చేసినట్లు రష్యా అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవడంతో, ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా సరఫరాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవలి గణాంకాల ప్రకారం, జనవరి 2026లో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు 19.3 శాతానికి తగ్గాయి. అయితే, ఫిబ్రవరి చివరి నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత భారత్ మళ్లీ రష్యా నుంచి కొనుగోళ్లను పెంచుతోంది. ఇంధనంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఎరువులు, కనెక్టివిటీ వంటి ఇతర రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించడంపై ఈ సమావేశాల్లో చర్చించారు. గతేడాది భారత్‌కు ఎరువుల సరఫరా 40 శాతం పెంచామని, భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహకరిస్తామని మంటురోవ్ తెలిపారు. రష్యా తాజా ప్రతిపాదన భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇవ్వడంతో పాటు, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# మాపై వివక్ష చూపారు

- మొదటి పేజి తరువాయి

ఇచ్చారని వారు ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి మాత్రం 20 నిమిషాల సమయం కేటాయించడాన్ని వారు తప్పుబట్టారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కానీ తమపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు జరిగే న్యాయంపై ఎటువంటి స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. గుంటూరు - మచిలీపట్నం కారిడార్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయాలని జగన్ కోరిన విషయాన్ని వారు ఉపరాష్ట్రపతికి వివరించారు. చట్టసభల్లో తమ గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని, సంఖ్యాబలం ఉన్న పార్టీలకు తగిన సమయం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజధాని విషయంలో తాము సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# ట్రంప్ సంచలన నిర్ణయం.. విదేశీ మందులపై 100 శాతం సుంకం.. భారత కంపెనీలపై దీర్ఘకాలిక ప్రభావం?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మా రంగంపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశీయ భద్రత, సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను కారణంగా చూపుతూ.. విదేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని పేటెంట్ ఔషధాలపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాలోనే మందుల తయారీని ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ పరిణామం ప్రపంచ ఫార్మా మార్కెట్‌తో పాటు, భారత కంపెనీల భవిష్యత్తుపైనా ఆందోళన కలిగిస్తోంది.

**కొత్త ఆదేశాలు ఏం చెబుతున్నాయి?**

ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం విదేశాల నుంచి దిగుమతి అయ్యే పేటెంట్ లేదా బ్రాండెడ్ ఔషధాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు వర్తిస్తాయి. అయితే, అమెరికా ప్రభుత్వంతో "మోస్ట్ ఫేవర్డ్ నేషన్" ధరల ఒప్పందం కుదుర్చుకుని, అమెరికాలో తయారీ యూనిట్లను నిర్మిస్తున్న కంపెనీలకు సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ధరల ఒప్పందం చేసుకోకపోయినా, అమెరికాలో తయారీ ప్రాజెక్టులు చేపడుతున్న కంపెనీలకు 20 శాతం సుంకం విధిస్తారు. నాలుగేళ్లలో ఈ సుంకం 100 శాతానికి పెరుగుతుంది. ఒప్పందాలు చేసుకోని పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతర కంపెనీలకు 180 రోజుల గడువు ఇచ్చారు. ఈ లోపు ఒప్పందాలు చేసుకోకపోతే 100 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి. ఇప్పటికే 17 ప్రముఖ ఫార్మా కంపెనీలతో ధరల ఒప్పందాలు కుదిరినట్లు, వాటిలో 13 కంపెనీలు సంతకాలు చేసినట్లు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు.

# ప్రజాస్వామ్యమా? ఫ్యూడల్ రాజ్యమా?:

## దళితులపై వరుస దాడులతో అట్టుడుకుతున్న ఏపీ!



**విశాఖ, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న సంఘటనలు దళిత సామాజిక వర్గాల్లో తీవ్ర భయాందోళనలను, ఆగ్రహాన్ని నింపుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి, చట్టాన్ని రక్షించాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సీపట్నంలో డప్పు కళాకారుడిపై స్పీకర్ చేయిచేసుకోవడం

నర్సీపట్నం శ్రీరామ నవమి ఉత్సవా ల్లో భాగంగా డప్పు కొడుతున్న 'ఎ ద్దుల భాస్కరరావు' అనే వృద్ధుడైన మాదిగ సామాజిక వర్గ వ్యక్తిపై అసెం బ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అందరి ముందే చేయిచే సుకోవడం సంచలనంగా మారింది. సుమారు 58 మంది మాల సామా జిక వర్గానికి చెందిన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపడం పై తీవ్ర నిరస నలు వ్యక్తమవుతున్నాయి. మత విద్వేషాల నెపంతో స్థానిక దళితు లను వేధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యమంత్రికి విజ్ఞప్తి అధికారులు స్పందించాలి!

ఈ దాడులు కేవలం వ్యక్తులపై జరిగినవి కావు, ఇవి ఒక వర్గం యొక్క ఆత్మగౌరవంపై జరుగు తున్న దాడులుగా భావించాల్సి ఉంటుంది. బాధితులకు న్యాయం జరగకపోతే పర్యవ సానాలు తీవ్రంగా ఉంటాయని దళిత సంఘాలు హెచ్చరిస్తున్నాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు బాధితుడికి బహిరంగ క్షమాపణ చెప్పాలి.. ఆకివీడు ఘటనలో అక్రమంగా అరెస్ట్ అయిన వారిని తక్షణమే విడుదల చేయాల. దళితులపై దాడులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద చర్యలు తీ సుకోవాలి.

అధికార గర్వంతో సామాన్యులను హింసించడం ప్రజాస్వామ్యానికి చేటు. ప్రభుత్వం తక్షణమే స్పం దించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా


# డేటింగ్ యాప్లను, అశ్లీల వెబ్సైట్లను రద్దు చేసి మహిళలకు రక్షణ కల్పించాలి..పి ఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం లక్ష్మి డిమాండ్





**విశాఖ, ఏప్రిల్ 3: (పెన్ పవర్)** డేటింగ్ యాప్లను రద్దు చేసి, అశ్లీల వెబ్సైట్లను నిలిపివేసి మహిళలకు రక్షణ కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం ( పి ఓ డబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం లక్ష్మి డిమాండ్ చేశారు. ఇటీవల గాజువాకలో నేవీ ఉద్యోగి చేతిలో హత్యకు గురైన మౌనిక సంఘటనకు సంబంధించి తాటి చెట్ల పాలెం జాతీయ రహదారి పక్కన అంబేద్కర్ విగ్రహం వద్ద పి ఓ డబ్ల్యు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఏసిపి మీడియా సమావేశంలో మర్డర్ చేశాక ఏమి చేయాలో తెలియక నిందితుడు శవాన్ని ముక్కలు చేశాడని, నిందితుడిని వెనక వేసుకుని వస్తున్నారని మండి పడ్డారు. తండ్రి వేణుగోపాల్, తల్లి శకుంతల, అక్క వసంత మాట్లాడుతూ ఈవెంట్ కని ఇంటి నుండి మౌనిక బయలుదేరి వెళ్లిందని దారుణంగా హత్యకు గురవుతుందని అనుకోలేదన్నారు. దళిత నాయకులు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ మహిళల హత్య కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అందుకు ఉదాహరణగా అయేషా మీరా కేసును ఉదాహరణగా చెప్పారు.

సీనియర్ అడ్వకేట్ పీవీ గిరిధర్ మాట్లాడుతూ మీడియాలో పోలీసులు పద్ధతిగా మాట్లాడితే బాగుంటుందన్నారు. పోలీస్ శాఖ హత్య కేసుల్లో ప్రొసీజర్ పద్ధతులను స్కిప్ చేస్తున్నారని, దీనివలన నిందితులు తప్పించుకుంటున్నారు అన్నారు. ఇది చాలా క్రోరమైన హత్య అనే, నేటి వరకు ఇంకెవెస్ట్ జరగలేదన్నారు. నేరం గురించి కొంత సమాచారం మాత్రమే ఇవ్వాలని, పోలీసులే కేసులను డిసైడ్ చేయడం, ఎన్కౌంటర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాపర్ ఇన్వెస్టిగేషన్ పోలీసులు చేయకపోవడం వలన నిందితులు పెట్రేగిపోతున్నారని తెలిపారు. చైతన్య మహిళా సంఘం సిఎంఎస్ అధ్యక్షురాలు లలితా మాట్లాడుతూ హోం శాఖ మంత్రి అనిత మహిళ అయి ఉండి సరిగా స్పందించలేదన్నారు. మర్డర్ కు గురైన బాధితురాలు దళిత కావడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జ్యుడిషల్ విచారణ త్వరిత గదిలో నిర్వహించి నిందితునికి కఠిన శిక్ష పడేలా చూసి, బాధితురాలు కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక ప్రతినిధి అనురాధ, మహిళా సంఘాల నేతలు డి నిర్మల, నిర్మల, వరలక్ష్మి, భారత నాస్తిక సమాజం అధ్యక్షులు జీడి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కొట్టుకుపోయిన కుంకుంపూడి రహదారి





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** మారుమూల గ్రామాల్లో చేపడుతున్న రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తోంది. రహదారి నిర్మించి కొన్నాళ్ళకే అవి మరమ్మతులకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షాలకు కొట్టుకుపోతున్నాయి. ఇలా జీకేవిధి మండలం కుంకంపూడి రహదారి నిర్మించే ఐదేళ్లు పూర్తవ్వకుండానే శిథిల వ్యవస్థకు చేరుకుంది. శుక్రవారం కురిసిన వర్షానికి ఈ తారు రోడ్డు కొట్టుకుపోయి మట్టిరోడ్డులా రూపు మారిపోయింది. గతంలో మరమ్మతులు గురైనప్పుడు కాంట్రాక్టర్లు బాగుచేసినా చిన్నపాటి వర్షాలకే రోడ్డు కొట్టుకుపోవడం పై గిరిజనులు తీవ్ర అసంతృప్తివ్రతం చేస్తున్నారు. నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టాలని నాణ్యత ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# మావిగన్ ప్రతిపాదనపై జగన్పై గంటా తీవ్ర విమర్శలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** రాజధాని అంశంలో వైఖరి మారుస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని భీమిలి ఎమ్మె ల్యే , వైసీపీ అధినేత పై తీవ్ర విమర్శలు గుప్పిం చారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్నప్పుడు విశాఖపట్నాన్ని పరిపాలన రాజధా నిగా ప్రకటించిన జగన్, ప్రస్తుతం మచిలీప ట్నం--విజయవాడ--గుంటూరు (మావిగన్) ప్రాంతాన్ని రాజధానిగా ప్రతిపాదించడం ద్వారా విశాఖను పక్కన పెట్టినట్టే అని వ్యాఖ్యానించా రు.అమరావతిని రాజధానిగా అంగీకరిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జగన్, 2019లో అధికా రంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో విశాఖను ముందుకు తెచ్చారని గుర్తుచే శారు. ఇప్పుడు మావిగన్ ప్రతిపాదన చేయడం ఆయన వైఖరిలో స్థిరత్వం లేదనే విషయాన్ని స్పష్టంగా చూపుతోందన్నారు.ఏప్రిల్ 1న మా విగన్ ప్రతిపాదన చేయడం ప్రజల్లో సందేహాలకు తావిస్తోంది అని విమర్శించిన గంటా, జగన్ వ్యాఖ్యలు తరచూ మారుతుండటం ప్రజల్లో అయోమయం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భం గా ఆయన సినీ నటుడు ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అమరా వతి రాజధాని బిల్లుకు దేశవ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినప్పటికీ, వైసీపీ మాత్రమే వ్యతిరేకించిందని గంటా ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని అవసరం లేదని చెప్పడం కూడా విచిత్రమని పేర్కొన్నారు.

అదేవిధంగా భోగాపురం విమానాశ్రయం, స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టుల విషయంలో కూడా జగన్ తన మాటలు మా ర్చుకుంటూ క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తు న్నారని విమర్శించారు. అభివృద్ధి అంశాలపై స్పష్టమైన దిశ లేకపోవడం రాష్ట్రానికి నష్టం కలిగిస్తోందన్నారు.

ఈ సమావేశంలో పంచకర్ల సందీప్, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, కంటుభుక్త రామానాయుడు, కాళ్ల నగేష్ కుమార్, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# అంతర్జాతీయ నగరంగా విశాఖ రూపాంతరం





## కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ దిశానిర్దేశం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :** విశాఖ నగరాన్ని ప్రపంచ స్థాయి మౌలిక సదు పాయాలతో అభివృద్ధి చేసి అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన లక్ష్య మని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యా లయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు.నూతన కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా జీవీఎంసీ ప్రత్యేక అధికారిగా సమావేశానికి హాజరైన ఆయనకు కమిషనర్ సహా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం వివిధ విభాగాల పనితీరు పై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపై అంతర్జాతీయ స్థాయిలో దృష్టి కేంద్రీకృతమవు తోందని, దానికి తగిన విధంగా మున్సిపల్ యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచే యాలని సూచించారు. ప్రపంచంలోని ఉత్తమ ప్రాజెక్టులను ఆదర్శంగా తీసుకుని నగర అభివృ ద్ధికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధికారు లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉం డి సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు.జీవీఎంసీ ఆదాయ వనరులను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆర్థిక పరిపుష్టి ద్వారా అభివృ ద్ధి పనులను వేగవంతం చేయాలని సూచిం చారు. నగరాన్ని 7-స్టార్ రేటింగ్ స్థాయికి తీసు కెళ్లి స్వచ్ఛ సర్వేక్షణలో మొదటి ర్యాంక్ సాధిం చేందుకు కృషి చేయాలని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో మురుగు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, పుట్టిన మరియు మరణ ధృవప త్రాల వంటి సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి ప్రజల ఇంటివద్దకే అందించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.వేసవి దృష్ట్యా చలివేం ద్రాల ఏర్పాటు, తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ కోసం సిఎస్ఆర్ నిధులను వినియోగిం చుకోవాలని సూచించారు. భోగాపురం విమా నాశ్రయ ప్రారంభానికి ముందే అనుసంధాన రహదారుల పనులను పూర్తి చేయాలని, భూ సంబంధిత సమస్యలు ఉంటే తక్షణమే పరిష్క రించాలని ఆదేశించారు.పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్, బయోగ్యాస్, రీసైక్లింగ్ విధానాలు, ప్రజా మరుగుదొడ్లు, మలేరియా నియంత్రణ వంటి అంశాలపై సమీక్షించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచిం చారు. ఇంజనీరింగ్ విభాగంలో రహదారులు, కాలువలు, పార్కులు, గ్రీన్ బెల్టులు, స్మార్ట్ మార్కెట్లు, స్ట్రీట్ లైటింగ్, తాగునీటి సరఫరా, టిడ్కో గృహ నిర్మాణం వంటి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.విశాఖపట్నం రా ష్ట్రంలో అతిపెద్ద నగరపాలక సంస్థగా ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించా ల్సిన బాధ్యత ఉందని, నగరాభివృద్ధికి ప్రజల సహకారం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నా రు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషన ర్లు, ఇంజనీరింగ్, ఆరోగ్యం, ప్రణాళిక విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలాస--సోంపేట--ఇచ్ఛాపురం రైల్వే మార్పు నిర్ణయం స్వాగతం: చలసాని గాంధీ



**విశాఖ ఏప్రిల్ 03:(పెన్ పవర్)**పలాస--సోంపేట--ఇచ్ఛాపురం రైల్వే విభాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే మండలంలోని విశాఖపట్నం విభాగ పరిధిలోకి మార్చడం ఆహ్వానించదగిన నిర్ణయమని డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, రైల్వే కార్మిక సంఘం సీనియర్ మాజీ నాయకుడు చలసాని గాంధీ పేర్కొన్నారు.
శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ డిమాండ్‌కు మూలం మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు కాలం నుంచే ఉందని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మరియు విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు మతుకుమిల్లి శ్రీ భరత్ కృషితో ఈ డిమాండ్ నెరవేరడం సంతోషకరమని అన్నారు. ఈ విజయానికి రైల్వే కార్మికులు, ఉత్తరాంధ్ర ప్రజల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు.
అదేవిధంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.
కేకే లైన్‌లోని అరకు విభాగాన్ని రాయగడ విభాగంలో చేర్చే ప్రతిపాదనపై పునఃపరిశీలన చేయాలని ఆయన కోరారు. ఆ విభాగాన్ని విశాఖపట్నం పరిధిలోనే కొనసాగించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ శ్రీ భరత్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రైల్వే మంత్రి సానుకూలంగా స్పందిస్తారని నమ్మకం వ్యక్తం చేశారు.
దక్షిణ కోస్తా రైల్వే మండలాన్ని త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన గెజిట్ ప్రకటన విడుదల చేసి కార్యాచరణ ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకటనలో అరకు విభాగాన్ని విశాఖపట్నం పరిధిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ నిర్ణయం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు కలుగుతాయని, కొత్త రైళ్లు, కొత్త మార్గాలు, మెరుగైన ప్రయాణ సదుపాయాల అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని చలసాని గాంధీ తెలిపారు.

## వంచుల పంచాయతీ అభివృద్ధికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

- సర్పంచ్ వనపల కాసులమ్మ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండలం, వంచుల పంచాయతీ మాజీ సర్పంచ్ వనపల కాసులమ్మ తన పదవీకాలం ముగిసిన సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ వరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె, శనివారం తన భర్త, నియోజకవర్గ వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్‌తో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ పదవీకాలంలో ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు ఎంతో చక్కని సహకారం అందించారని తెలిపారు. అలాగే పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేశారని పేర్కొన్నారు.అదేవిధంగా, అధికారుల సహకారం, ఎమ్మెల్యే మరియు ఇతర ప్రజాప్రతినిధుల మద్దతు గత ఐదేళ్లుగా పంచాయతీ అభివృద్ధికి ఎంతో దోహదపడిందని అన్నారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వనపల కాసులమ్మ, రాజేష్ దంపతులు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

## దళితులను రాజకీయంగా వాడుకోవడం వైసీపీ కి అలవాటు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రెల్ 03) :**దళితుల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వైసీపీకి అలవాటైందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజన్న వీర సూర్యచంద్ర విమర్శించారు. నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించిన శ్రీమరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒక దళితుడిపై చేయి చేసుకున్నారంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఆయన శుక్రవారం ఖండించారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవం వేరుగా ఉందని సూర్యచంద్ర తెలిపారు. పండుగ సమయంలో డప్పు వాయిస్తున్న నాగేశ్వరరావు అనుకోకుండా ముందే కాలి నొప్పితో బాధపడుతున్న అయ్యన్నపాత్రుడు కాలిపై తొక్కడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని వివరించారు. ఈ సంఘటనను వైసీపీ అతిశయోక్తిగా ప్రచారం చేస్తూ రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మొదటి నుంచే దళితుల భావోద్వేగాలను రెచ్చగొట్టడం వైసీపీ విధానమైందన్నారు.
గతంలో దళితుల సంక్షేమ పథకాలను రద్దు చేసి అన్యాయం చేసిన వైసీపీ, ఇప్పుడు దళితుల పట్ల మక్కువ చూపుతున్నట్లు మాట్లాడడం సమంజసం కాదని విమర్శించారు. వైసీపీ ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు.

## మత్స్యకారుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం:సమాఖ్య



**విశాఖ, ఏప్రిల్ 3(పెన్ పవర్):**మత్స్యకారుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నడుకుదిటి అర్జున, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు అన్నారు. డాబాగార్డెన్స్, వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకార సామాజిక వర్గంలో గల 14 ఉప కులాలకు వారి జనాభా ప్రాతిపదికన ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా కులాల అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాలలో అక్రమంగా చేపల వేట చేస్తూ మత్స్య సంపదను అక్రమంగా దోచుకు వెళ్తూ, రాష్ట్ర మత్స్యకారులపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితులలో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణరావు, నరసాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్ర సముద్ర జలాల్లో రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు మాత్రమే చేపల వేట చేసుకోవాలని నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల మత్స్యకారుల చేపల వేటను ఆపాలని ఉద్దేశంతో గస్తీ బోట్లను మంజూరు చేసి నిరంతరం సముద్రంలో పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, సమస్య పరిష్కారానికి కృషి చేసిన మత్స్యకారుల నాయకులకు సమాఖ్య తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు అర్జున, ముత్యాలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో అధిక సంఖ్యలో ఉన్న వాడ బలిజ కులానికి చెందిన వారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ పార్లమెంట్ స్థానాలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి నామినేటెడ్ పదవులు ఇవ్వలేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వాడబలిజ అభివృద్ధి, సంక్షేమ కార్పోరేషన్, శాసన మండలి ఎన్నికలలో వాడబలిజ మత్స్యకారులకు అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే నెయ్యిల, జాలరి, పట్టపు, కులాలకు కూడా ప్రత్యేక కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో 14 ఉప కులాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు





- తండోపతండాలుగా తరలివస్తున్న అభిమానులు
- జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన భోజనం
- మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే
- చిరంజీవి చౌదరి, కార్యదర్శి, రాష్ట్ర ఫుడ్ ప్రోసెసింగ్ విభాగం

**విశాఖ ఏప్రిల్ 3 (పెన్ పవర్)** విజయవంతంగా శబలా భోజనాల సంబరాలు నిర్వహించుకున్నారు అని ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర విభాగం కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం సింహాచలం గోశాల వద్ద సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాల పండుగ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తండోపతండాలుగా తరలివస్తున్న అభిమానులను చూస్తుంటే ప్రకృతి వ్యవసాయదారుల మీద పెరుగుతున్న అభిమానానికి నిదర్శనం అన్నారు. ఈ భోజనాలు పండుగ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది అన్నారు. మన ప్రకృతి వనరుల పరిరక్షణ బాధ్యత మనదే అన్నారు.
భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా మాత్రమే పంటలు పండించడం అవసరం అన్నారు. వేలాది మంది ఈ భోజనాలు పండుగను జయప్రదం చేయడం ఆనందంగా ఉంది అన్నారు.
ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి జి ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా వ్యవసాయం చేయడం అవసరం అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతుల సంఖ్య పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిలెట్స్ రాంబాబు, ఆయుర్వేద వైద్యులు సుందరరాజ పెరుమాళ్, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర ధామా, విఎంఆర్ డిఎ చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ ప్రసాద్, విశాఖ పోర్టు ట్రస్టు ఉద్యానవన అధికారి రాధిక, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం ఉత్తర ఆంధ్ర అధికారి జనార్ధన్ లు మాట్లాడారు.
ఉత్తర ఆంధ్ర జర్నలిస్ట్ ప్రంట్ అధ్యక్షులు వర్మ తమ సంస్థ డైరీలు పంపిణీ చేశారు
ఈ కార్యక్రమంలో సంకల్ప కళా గ్రామం ప్రతినిధి ఆకుల చలపతి రావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, మేంగో మేన్ అప్పాజీ, దేశీయ ఆవులు ప్రదర్శన నిర్వహించిన మహేష్ , మేడ్ గార్డెనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు తప్పని డోలి కష్టాలు ..

- తరాలు మారుతున్నా గిరిజనులు తలరాతలు మారడం లేదు అనడానికి నిదర్శనం ఈ ఘటన..
- రహదారి సౌకర్యం లేక మంచంపై 2 కిలో మీటర్లు నడుచుకుంటూ మృతదేహాన్ని గ్రామానికి మోసుకెళ్లిన చాపరాయి గిరిజనలు...

**కురుపాం, ఏప్రిల్ 3,పెన్ పవర్ :** పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చాపరాయి గూడ గ్రామానికి చెందిన మల్లేష్ (27) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడటంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా కేంద్ర హాస్పటల్ కు తరలించి చికిత్స అందించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం మల్లేష్ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు పార్వతీపురం నుంచి పిటి మండ గ్రామం వరకు అంబులెన్స్ లో మృతదేహాన్ని తీసుకువచ్చారు.పిటి మండ జంక్షన్ నుంచి చాపరాయి గూడ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల మేర మంచంపై మృతదేహం మోసుకెళ్లిన పరిస్థితి ఏర్పడింది.చాపరాయి గూడ, దీసరి గూడ, బాపన్న గూడ గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నాయకులు,అధికారులు వెంటనే స్పందించి చాపరాయిగూడ, బాపన గూడ,దేశరిగూడ గ్రామాలకు రహదారి నిర్మించి ఆదుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు...

## ఉరుములతో భారీ వర్షం- రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** జీకే వీధి మండలంలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండగా, అనంతరం మబ్బులు కమ్ముకుని వర్షం ప్రారంభమైంది.ఈ వర్షం ప్రభావంతో చాపగెడ్డ ఆర్వి నగర్ రహదారిపై ఒక పెద్ద చెట్టు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ఆర్వీ నగర్ గ్రామస్తులు వెంటనే స్పందించి, జెసిబి సహాయంతో చెట్టును తొలగించారు. దీంతో కొంతసేపటి తరువాత రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. గ్రామస్తుల సహకారంతో సమస్య త్వరగా పరిష్కారమైంది.

## మండలంలో ఘనంగా గుడ్ ఫ్రైడే (శుభశుక్రవారం) వేడుకలు.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3.** చింతపల్లి మండలంలో, మండల కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాలలో గుడ్ ఫ్రైడే (శుభశుక్రవారం) వేడుకలను అత్యంత వైభవంగా క్రైస్తవ సహోదరులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ మత పెద్దలు (పాస్టర్లు) మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, క్షమాగుణం, విమోచన వంటి మహత్తర కార్యాలకు నిదర్శనం యేసు సిలువ త్యాగం అన్నారు. ఏసుక్రీస్తు సిలువలు మానవుల పాపాల విమోచన కోసం క్రయధానంగా తన ప్రాణాన్ని అర్పించారని, తనను సిలువ వేసి హింసించిన వారిని సైతం యేసు క్షమించి గొప్ప క్షమా భావాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అలాగే మానవాళి పాపాలకు విముక్తిని ప్రసాదించిన రోజును గుడ్ ఫ్రైడే గా క్రైస్తవులు జరుపుకుంటారన్నారు. సిలువపై తనను తాను అప్పగించుకుని మరణించి న రోజును గుడ్ ఫ్రైడే గా పిలుచుకుంటారన్నారు. ఆయన సిలువ మరణం పొందడమే మానవాళి రక్షణకు శుభప్రదమని తెలియజేసే సందర్భాన్ని గుడ్ ఫ్రైడే గా ప్రతి ఏడాది జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఏసుక్రీస్తు అపారమైన ప్రేమకు ప్రతీకగా గుడ్ ఫ్రైడే గొప్ప సందేశాత్మకంగా చరిత్రలో నిలిచి మానవాళి రక్షణకు అద్దం పడుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ర్యాలీని నిర్వహించారు.

## కోడి గుడ్డు ఒకటి కానీ పిల్లలు రెండు..!



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** మండలంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. సాధారణంగా ఒక కోడిగుడ్డులో ఒక పిల్ల మాత్రమే పుడుతుంది. అయితే గూడెం కొత్తవీధి మండలంలో ఇందుకు భిన్నంగా ఒకే గుడ్డులో రెండు కోడి పిల్లలు పుట్టిన ఘటన స్థానికంగా ఆసక్తి కలిగిస్తోంది.జీకే వీధి పంచాయతీ కొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు బుడి ప్రసాద్ పెంచుతున్న నాటు కోడిపెట్ట ఇటీవల గుడ్లు పెట్టింది. శుక్రవారం ఆ గుడ్లు పొదిగే సమయంలో ఒక గుడ్డులో రెండు కోడి పిల్లలు బయటకు వచ్చాయి. అయితే అవి కొద్దిసేపటికే మృతి చెందినట్లు రైతు తెలిపారు.ఈ ఘటనపై పశువైద్యాధికారి రమేష్ స్పందిస్తూ, ఇలాంటి అరుదైన సంఘటనలు జన్యుపరమైన లోపాల కారణంగా చోటుచేసుకుంటాయని తెలిపారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఐటీడీఏ పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్న యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

జడ్పిటిసి పోతురాజు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3.** ఐటీడీఏ ద్వారా పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్న యంత్రాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. శుక్రవారం చింతపల్లిలోని ఎస్ ఎన్ టి ఫారం లో హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్కీ బొంజు బాబుతో కలిసి కాఫీ రైతులకు నిచ్చెనలు, బేబీ పల్పర్ మిషన్లు, తార్పాన్లు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కాఫీ రైతులకు ఉచితంగా యంత్రాలను ఐటిడిఏ పంపిణీ చేయడం శుభ పరిణామం అన్నారు. ఐటీడీఏ ద్వారా పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ఈ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాఫీ పండించిన రైతులు ఐటీడీఏ ద్వారా నడపబడుతున్న మార్క్ఫ్ సొసైటీకి కాఫీని అమ్మిన రైతులకు ఉచితంగా ఈ యంత్రాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాఫీ రైతులందరూ ఐటీడీఏ ద్వారా నడపబడుతున్న మార్క్ సొసైటీకి కాఫీ గింజలు ఇచ్చి ఉంటే ఈ యంత్రాలు ప్రతి రైతుకు అంది ఉండేవని ఆయన అభిప్రాయపడ్డారు. చింతపల్లి జికే వీధి మండలాల కాఫీ రైతులకు ఒక్కొక్క మండలానికి 400 నిచ్చెనలు, 400 బేబీ పల్పర్ మిషన్లు, 100 టార్పాలిన్ లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇదే క్రమంలో జిసిసిని నమ్మి చాలామంది కాఫీ రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా జిసిసిని నమ్మి చాలామంది రైతులు తమ పండించిన కాఫీని అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. జిసిసి నమ్మిన రైతులను నిలువుగా ముంచిందని దియబడ్డారు. కల్లి బొల్లి మాటలతో నమ్మించి ఇటువంటి సంస్థలను నమ్మొద్దని ఆయన రైతులను కోరారు. ఇదే తరుణంలో రైతుల వద్ద ఉన్న కాఫీని గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని జిసిసిని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కల్పించే మంచి సదవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గొర్లె వీర వెంకట్, జీకే వీధి బిజెపి మండల అధ్యక్షులు కాకూరి శేఖర్, చింతపల్లి పంచాయతీ జనసేన అధ్యక్షులు సుర్ల వీరేంద్ర కుమార్, చింతపల్లి మండల జనసేన యూత్ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, కాఫీ ఏ ఈ ఓ పి ధర్మరాజు జీకే వీధి హార్టికల్చర్ అసిస్టెంట్ అరుణకుమారి, జిమాడుగుల కాఫీ అసిస్టెంట్ బాబురావు మూడు మండలాల కాఫీ రైతులు పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధతపై హర్షం... మూడు రాజధానులపై వైసీపీకి ఘాటు హెచ్చరిక



జనసేన నేత పీతల మూర్తి యాదవ్

**విశాఖ ఏప్రిల్ 3:(పెన్ పవర్)**అమరావతి చట్టబద్ధత బిల్లును ఏకగ్రీవంగా ఉభయసభలు ఆమోదించటం పట్ల ఆనందంగా ఉంది
1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన 'ఆంధ్ర రాష్ట్రం'...ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత పొందిన తొలి రాష్ట్రంగా ఏపీ ప్రత్యేకత సాధించింది
భూములు ఇచ్చిన రైతులను ఎన్నో అవమానాలకు గురిచేశారు
ఈ రోజు ఓ హిస్టరీ అమరావతి కేవలం రాజధాని కాదు తెలుగుజాతి గౌరవం,రైతుల త్యాగాల ప్రతీక
29 వేల మంది రైతులు...33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చిన త్యాగ ఫలితం అమరావతి
1,631 రోజులు చేసిన రైతుల ఉద్యమానికి సెల్యూట్
అమరావతి స్మశానం అని అప్పుడు మాటలు మాట్లాడారు...మావిగన్ అంటూ ఇప్పుడు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు
సీఎం చంద్రబాబు దూరదృష్టితో...డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోడీ తో అమరావతి ప్రపంచ స్థాయి రాజధాని దిశగా అడుగులు వేస్తోంది
ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో డబుల్ ఇంజన్ సర్కార్ తో ఆంధ్ర ప్రదేశ్ వెలుగుతోంది
నిత్యం గన్ తో జీవితం గడిపే జగన్ కి మావిగన్ అనే పేర్లు వస్తాయి
మావిగన్ అంటూ మారిచుడు కబుర్లు ఎందుకు జగన్
మావిగన్ అంటే గన్ గుర్తుకు వస్తుంది...మీ బాబాయ్ గొడ్డలి గుర్తుకు వస్తుంది
ఈ గన్ కల్చర్ మనకు అవసరమా జగన్
అమరావతి అంటే దేవతల రాజధాని దేవుళ్ళు గుర్తకువస్తారు
పార్లమెంట్ లో బాయ్ కాట్ చేసి బాడ్ బాయ్ గా మిగిలిపోయాడు జగన్
అసలు సిగ్గు ఉందా వైసిపీ కి...ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రం లో అడుగు పెడతారు వైసీపీ ఎంపీ లు
మూడు రాజధానులు పేరు చెప్పి మూడు ప్రాంతాలు దోచుకున్నారు.
ఉత్తరాంధ్రను పరిపాలన రాజధాని చేస్తామని చెప్పి ప్రజల్ని మబ్బిపెట్టి మోసం చేసావు
మరి మావిగన్ అని...మూడు రాజధానులు అని...రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని లేదు అని అంటావు
ఒకవేళ పొరపాటున భవిష్యత్లో మీ పార్టీ అధికారం లోకి వస్తే...రాజధాని విషయం పై మీ స్పష్టమైన వైఖరి తెలియచెయ్యాలి కదా
జగన్ ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి...సింహాచలం అప్పన్న స్వామి వద్ద ముక్కు నేలకు రాయాలి
ఇప్పుడు ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి
జగన్ మనసు మార్చుకొని అమరావతి కి మద్దతు ఇస్తాను అంటే కాళ్ళు కడిగి నీళ్లు నెత్తిన వేసుకుంటాను
జీతం తీసుకుంటావు పులివెందుల శాసనసభ్యుడిగా అసెంబ్లీ కి రావాలి కదా...చేర్చ లో పాల్గొనాలి కదా
అమరావతి కి అనుకూలమా వ్యతిరేకమా చెప్పాలి కదా...జగన్ డ్రామాలు వొద్దు
ఆంధ్రప్రదేశ్ రాజధాని కల నెరవేరకుండా మోకాలడ్డుతూ జగన్ ఆడిన మూడుముక్కలాట ముగిసింది
మన తెలుగు తల్లిని కట్టు బట్టలతో రోడ్ మీద నిలబెట్టారు.
అటువంటిది ఈ రోజు అమరావతి అనే ఇంద్రభవనం లాంటి అలయాన్ని కట్టి అమరావతి రాజధానిగా ఏర్పాటు చేసి తెలుగు తల్లి కి నీరాజనం పలుకుతున్నాం.
ఇప్పటివరకు "మూడు రాజధానుల" మంత్రాన్ని జపించిన జగన్...ఇప్పుడు అర్ధంతరంగా 'మావిగన్' అనే సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకురావటం జగన్ మానసిక స్థితి పై అనుమానం కలుగుతోంది
ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని ఉంటుంది అని...అది అమరావతే అని చెప్పిన వ్యక్తి పవన్ కళ్యాణ్
అమరావతి రైతుల ఉద్యమానికి మద్దతు ఇచ్చారు
పవన్ కళ్యాణ్ మద్దతు ఓర్వలేక ఇప్పటం లాంటి ఘటనలు వైసీపీ సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేశారు
జనసేన పార్టీ అమరావతి కోసం పోరాటం లో పిడికిలి బిగించి నిలిచిన పార్టీ.
నిన్న పార్లిమెంట్ లో అన్ని పార్టీ లు తెలుగు వారికి ఆంధ్రప్రదేశ్ కి అండగా నిలిచారు
కానీ ఒక్క వైసీపీ నే రాష్ట్ర ప్రజలను పార్లిమెంట్ సాక్షిగా నట్టేట ముంచారు...
ఇది వైసీపీ నిజ స్వరూపం నిజమైన రాజకీయ విశ్వ రూపం

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏప్రిల్ 6న ఆర్వి నగర్,జీకే వీధి వారపు సంతల ఆశీలు వేలం పాట



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:** అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని ఆర్వి నగర్,జీకే వీధి వారపు సంత ఆశీలు వేలంపాట ఈనెల 6వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు గూడెం కొత్తవీధి గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ తెలిపారు.గూడెం కొత్తవీధి, ఆర్వీ నగర్ ప్రాంతాలకు సంబంధించిన వారపు సంత ఆశీలు వసూలు వేలం ద్వారా కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల నుండి అదే రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.మధ్యాహ్నం 3 గంటలకు వేలంపాట నిర్వహించబడుతుందని, ఆసక్తి ఉన్న వారు తప్పక పాల్గొనాలని కార్యదర్శి కోరారు.


## రాగల ఐదు రోజుల్లో తేలిక పాటి వర్ష సూచన.

వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ .ఆళ్ల అప్పలస్వామి.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3.** జిల్లాలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. జిల్లాలు రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శుక్రవారం శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈనెల ఏడవ తేదీ వరకు 04 మిల్లీమీటర్ల నుంచి 13 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## ఈనెల 12న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.




**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3.** ఈనెల 12వ తేదీ ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని యూ.వి.గిరి, విద్యాసాగర్, వెంకటరమణ, మోహన్ రావు, పద్మనాభం కమిటీగా ఏర్పడి ప్రస్తుత ప్రిన్సిపాల్ కెవి రామేశ్వరం మార్గదర్శకంలో ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చింతపల్లి గురుకుల కళాశాలలో 1985 నుండి ఇప్పటివరకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి వివిధ హోదాలలో దేశ నలుమూలల స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ ప్రగతికి బాటలు వేసిన గురుకుల కళాశాల చింతపల్లిలో ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చింతపల్లి గురుకుల కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆహ్వానితులేనని ప్రతి ఒక్కరు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# చంద్రంపాలెం జాతర గట్టులో భక్తులకు చలివేంద్రం

మజ్జిగ, అన్నప్రసాదంతో సేవలు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :**ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తు లకు, బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు మధురవాడ ప్రాంతంలోని చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకాకు ళం జిల్లా శ్రీ ఉమా రుద్ర కోటేశ్వర స్వామి దేవాల య అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర్, లక్ష్మి ప్రసన్న దంపతుల సహాయ సహకారాలతో మజ్జిగను భ క్తులకు, పాదచారులకు, వాహనదారులకు పం పిణీ చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ స భ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పిళ్లా మధు పాత్రుడు, పిళ్లా శ్రీని వాసరావు, బావిశెట్టి సత్యన్నారాయణ, జగుపి ల్లి నాని, బోగవిల్లి నాని, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, సెక్రటరీ నాగోటి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాస రావు, ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గత మార్చి నెల నుండి ఎండలు తీవ్రంగా ఉండటంతో భక్తులు, ప్రయా ణికులకు ఉపశమనం కలిగించేందుకు చలివేం ద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆలయ ప్రాంగణంలో భక్తులు, దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమం కొన సాగుతున్నదని, వారానికి రెండు నుంచి మూ డు సార్లు మజ్జిగ పంపిణీ, మిగతా రోజుల్లో చల్ల ని తాగునీరు అందజేస్తున్నామని వెల్లడించారు.

అదే రోజు అమ్మవారి ఆలయంలో విశేష పూజ లు నిర్వహించారు. ఉదయం నిత్యపూజలతో ప్రారంభమై భక్తుల గోత్రనామాలతో కుంకుమా ర్చనలు, పుష్పార్చనలు నిర్వహించి తీర్థప్రసా దాలు అందజేశారు. సాయంత్రం పంచామృ తంతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఇక విశాఖపట్నానికి చెందిన మురళి, శ్యామల కుటుంబ సభ్యుల సహకారంతో పులిహోర ప్రసాదాన్ని ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతీ శుక్రవారం లాగే ఈరోజు కూడా పిళ్లా శ్రీనివాసరావు, రామలక్ష్మి దంపతులు మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యం లో సుమారు 300 మంది పేదలు, భక్తులు, బాటసారులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

# కూటమి ప్రభుత్వంతోనే మత్స్యకారుల సమగ్రాభివృద్ధి: సమాఖ్య




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :**రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ సాంప్ర దాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య నాయకులు స్పష్టం చేశారు. డాబా గార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నడుకుదిటి అర్జున, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు మాట్లా డారు. రాష్ట్రంలోని మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన 14 ఉపకులాల అభివృద్ధి కోసం జనాభా ప్రాతిపదికన ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఆయా కులాల సంక్షేమానికి ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను విజ్ఞప్తి చేశారు.

తమిళనాడు, పాండిచ్చేరి ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట చేపడుతూ మత్స్య సంపదను దోచుకెళ్లడమే కాకుండా స్థానిక మ త్స్యకారులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యను రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణరావు, నరసా పురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కలిసి ము ఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.
దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్ర సముద్ర జలాల్లో స్థానిక మత్స్యకారులకే చేపల వేటకు అనుమతి ఉండాలని నెల్లూరు, తిరుపతి జిల్లా ల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడాన్ని వారు స్వాగతించారు. అలాగే సముద్రంలో గస్తీ బోట్ల ద్వారా నిఘా పెంచేందుకు తీసుకున్న చర్యలను అభినందించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధికంగా ఉన్న వాడబలిజ కులానికి ఇప్పటివరకు నామి నేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో వాడబలిజ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు శాసన మండలి ఎన్నికల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.
అదేవిధంగా నెయ్యిల, జాలరి, పట్టపు వంటి మత్స్యకార ఉపకులాలకు కూడా ప్రత్యేక కార్పొ రేషన్లు ఏర్పాటు చేసి, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో వివిధ ఉపకులాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బ్రాహ్మణ సంఘం సహకారం.



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3 .** చీపురుపల్లి పట్టణానికి చెందిన చెందిన అన్నపూర్ణ కాలనీలో నివాసముంటున్న దువ్వూరి సాయి కృష్ణ కుటుంబానికి చీపురుపల్లి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు 13 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పట్టణానికి చెందిన దువ్వూరి సాయికృష్ణ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ కడుపేదరకాన్ని అనుభవిస్తున్న పరిస్థితిని పత్రికల ద్వారా తెలుసుకొని సంఘ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెన్నుముక బాధితులకు పిల్లలు ఎవరూ లేకపోవడంతో పాటు సొంతగృహం కూడా లేకపోవడం వలన వైద్య ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పత్రికలో వచ్చిన కథనాలకు సంఘ సభ్యులు స్పందించారు. గత మూడు సంవత్సరాల నుంచి వెన్నెముక సమస్యతో బాధపడుతున్నారు. ఆయన సంపాదించిన సొమ్ము అంత విశాఖపట్నం, హైదరాబాదులో చికిత్స తీసుకున్నందున ఖర్చు కాగా ఆయన అప్పుల పాలు కావడంతో సంఘ సభ్యులు తమ వంతు వంతు సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు సభ్యులు బివి రమణ, కే వై శాస్త్రి, బి పి ఆర్ శాస్త్రి, ఏ. వాసు, జె నాగేశ్వరరావు , తదితరులు పాల్గొని బాధితుని భార్య లావణ్య కు 13 వేల రూపాయల నగదును అందజేశారు.

బాధిత కుటుంబానికి బ్రాహ్మణ సంఘం సహకారం.

చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 3 . చీపురుపల్లి పట్టణానికి చెందిన చెందిన అన్నపూర్ణ కాలనీలో నివాసముంటున్న దువ్వూరి సాయి కృష్ణ కుటుంబానికి చీపురుపల్లి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు 13 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పట్టణానికి చెందిన దువ్వూరి సాయికృష్ణ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ కడుపేదరకాన్ని అనుభవిస్తున్న పరిస్థితిని పత్రికల ద్వారా తెలుసుకొని సంఘ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెన్నుముక బాధితులకు పిల్లలు ఎవరూ లేకపోవడంతో పాటు సొంతగృహం కూడా లేకపోవడం వలన వైద్య ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పత్రికలో వచ్చిన కథనాలకు సంఘ సభ్యులు స్పందించారు. గత మూడు సంవత్సరాల నుంచి వెన్నెముక సమస్యతో బాధపడుతున్నారు. ఆయన సంపాదించిన సొమ్ము అంత విశాఖపట్నం, హైదరాబాదులో చికిత్స తీసుకున్నందున ఖర్చు కాగా ఆయన అప్పుల పాలు కావడంతో సంఘ సభ్యులు తమ వంతు వంతు సహకారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు సభ్యులు బివి రమణ, కే వై శాస్త్రి, బి పి ఆర్ శాస్త్రి, ఏ. వాసు, జె నాగేశ్వరరావు , తదితరులు పాల్గొని బాధితుని భార్య లావణ్య కు 13 వేల రూపాయల నగదును అందజేశారు.

## ఆదివాసి హక్కుల కోసం పోరాటానికి పీసా సభ్యుల మద్దతు

గిరిజన చట్టాలను కాలరాస్తే సహించం





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని రింతాడ గ్రామంలో ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న మాజీ ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్‌కు పీసా మండల బాడీ సభ్యులు సంఘీభావం తెలిపారు. గ్రామ కంఠ భూమిని గిరిజనేతరులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న విషయంపై సోమేశ్ కుమార్ అధికారులకు ఫిర్యాదు చేయగా, స్థానిక వీఆర్వోతో కలిసి వెళ్లి పనులను నిలిపివేశారు. ఈ క్రమంలో తనకు గిరిజనేతరుల నుంచి ప్రాణహాని ఉందని ఆయన గురువారం మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.ఈ విషయంపై స్పందించిన పీసా మండల బాడీ అధ్యక్షుడు కొర్ర బలరాం, ఉపాధ్యక్షుడు కొర్ర భూపతి, ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు,కార్యదర్శి గబులంగి గణేష్,కోశాధికారి లకె రామచంద్రరావు తదితరులు రింతాడ గ్రామాన్ని సందర్శించి సోమేశ్ కుమార్‌కు మద్దతు తెలిపారు.ఆర్‌వీ నగర్, రింతాడ పంచాయతీలకు చెందిన పీసా సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నారాయణరావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన ప్రత్యేక హక్కులను కాపాడుకోవడం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఆదివాసీల యొక్క హక్కులు చట్టాలను గురించి ప్రజలకు విరివిగా అవగాహన కల్పించాలని గిరిజన హక్కులు చట్టాల కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.అనంతరం గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించిన పీసా బృందం, 1/70 భూ బదలాయింపు చట్టానికి వ్యతిరేకంగా చేపడుతున్న కట్టడాలను వెంటనే నిలిపివేయాలని అధికారులను డిమాండ్ చేసింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, బంగారయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## కైలాసగిరి టికెట్ విధానంపై ఆగ్రహం

* అదనపు వసూళ్లు రద్దు చేయాలంటూ డిమాండ్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్,ఏప్రిల్ 03:**నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాస గిరిలో ఇటీవల అమలు చేస్తున్న కొత్త టికెట్ విధానం, పార్కింగ్ ఛార్జీలు మరియు అదనపు వసూళ్లపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవు తోంది.

ఇప్పటివరకు వాహనాలకు మాత్రమే టోల్ రుసుము వసూలు చేయగా, తాజాగా వాహనం లో ప్రయాణించే ప్రతి వ్యక్తికి రూ.10 చొప్పున అదనంగా వసూలు చేయడం అన్యాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా, సరైన సమా చారం ఇవ్వకుండానే ఈ విధానాన్ని అమలు చేయడం తీవ్రంగా విమర్శలకు దారితీసింది.

ఈ నిర్ణయం కారణంగా కుటుంబాలతో, స్నేహి తులతో కలిసి వచ్చే పర్యాటకులు అదనపు ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం అందించే ప్రదేశంగా ఉండాల్సిన కైలా సగిరిని ఆదాయ వనరుగా మార్చడం సరైన విధానం కాదని విమర్శిస్తున్నారు.

ఇలాంటి చర్యలు పర్యాటకాభివృద్ధికి ప్రతి కూలంగా మారడమే కాకుండా, ప్రజల్లో అసం తృప్తిని పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కాబట్టి వెంటనే పెరిగిన టికెట్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నా రు. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# గురుకుల పాఠశాలలో దారుణ పరిస్థితులు ఎమ్మెల్యే గంటా ఆగ్రహం






**బిమిలి , పెన్ పవర్, ఏప్రిల్ 03 :**భీమిలి నియోజకవర్గంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న దయనీయ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అక్కడి పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.డార్మెటరీలు, టాయ్‌లెట్లు, కిచెన్, స్టోర్ రూం వంటి విభాగాలను పరి శీలించిన ఆయన, విద్యార్థులు ఉపయోగించే పడకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తించారు. టాయ్‌లెట్ల వద్ద తీవ్ర దుర్గంధం వ్యాపించి, అక్క డికి వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. పాఠశా లలో పరిశుభ్రత లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.విద్యార్థులు నిద్ర పోతుండగా ఎలుకలు కొరకడం వంటి ఘటన లు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి అవ మానకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.కిచెన్, స్టోర్‌రూం పరిస్థితులు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, ఎలుకల సమస్య నివారణకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడిం చారు. విద్యా రంగంపై ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లోపం కారణంగా పేద తల్లిదండ్రులు కూడా ప్రై వేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేందుకు సౌకర్యాలను మెరుగుప రచడం అత్యవసరమని ఆయన సూచించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలు, డార్మెటరీలు, డైనింగ్ హాల్ తదితర సమస్యల ను ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్యల పరి ష్కారానికి హామీ లభించిందని వెల్లడించారు.

అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా విశాఖలో రాధా-రంగా మిత్రమండలి ఆత్మీయ సమావేశం



* ముఖ్య అతిథిగా జనసేన నేత బెహరా భాస్కరరావు హాజరు
* భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** స్థానిక విశాఖలో రాధా–రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం పెట్రోల్ బంక్, కుమారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు బెహరా భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి రెండు రాష్ట్రాల అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు అధ్యక్షత వహించగా, గేదెల మురళీకృష్ణ కీలక పాత్ర పోషించారు. సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మురళీకృష్ణపై నమ్మకం సంస్థ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తారన్న ఆశాభావం. ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ, విశాఖపట్నం రాధా–రంగా మిత్రమండలి నూతన అధ్యక్షుడిగా నియమితులైన గేదెల మురళీకృష్ణ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో సేవా కార్యక్రమాలు విస్తృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మిత్రమండలి సభ్యులను, ప్రజలను కలుపుకొని ముందుకు నడిపించే సామర్థ్యం మురళీకృష్ణకు ఉందని అభిప్రాయపడ్డారు. వంగవీటి మోహనరంగా స్ఫూర్తి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా సమావేశంలో పలువురు నాయకులు దివంగత నాయకుడు వంగవీటి మోహనరంగాను స్మరించారు.

ఆయనను కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలకు సేవ చేసిన మహోన్నత నాయకుడిగా కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఉన్న ఆదరణను ప్రతిబింబించేలా విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగుతుండటం ప్రజల్లో ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను మచ్చలేని నాయకుడిగా పేర్కొంటూ, ఆయన బడుగు బలహీన వర్గాల కోసం చేసిన సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో ఆయన ముఖ్యమంత్రిగా అవతరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, తమ మద్దతు ఎల్లప్పుడూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భాగంగా రాధా–రంగా మిత్రమండలి తరపున 12 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఇది సంస్థ విస్తరణకు మరియు కార్యకలాపాల బలోపేతానికి కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమం కేవలం ఒక ఆత్మీయ సమావేశం మాత్రమే కాకుండా, ఉత్తరాంధ్రలో రాధా–రంగా మిత్రమండలి ప్రభావాన్ని విస్తరించే దిశగా కీలకంగా నిలిచింది. మురళీకృష్ణ నాయకత్వంపై వ్యక్తమైన విశ్వాసం స్థానిక స్థాయిలో నాయకత్వ బలోపేతానికి సంకేతంగా భావిస్తున్నారు.

ఇక జనసేన పార్టీ పరంగా చూస్తే, ఈ సమావేశం స్థానిక రాజకీయ సమీకరణాల్లో తమ స్థానం బలపరచుకునే వ్యూహాత్మక ప్రయత్నంగా విశ్లేషించబడుతోంది. ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గంలో ప్రజా ఆధారాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. విశాఖలో జరిగిన ఈ సమావేశం వంగవీటి మోహనరంగా వారసత్వాన్ని స్మరించడమే కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజా కేంద్రిత నాయకత్వం అవసరాన్ని గుర్తు చేసింది. రాధా–రంగా మిత్రమండలి భవిష్యత్ దిశ, జనసేన పార్టీ వ్యూహాలు ఈ రెండింటికీ ఇది కీలక వేదికగా నిలిచిందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్డిసి చైర్మన్ టిడిపి అధ్యక్షులు ఎలమంచిలి ప్రగడ నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర కన్వీనర్ కుంచె దత్తాత్రేయులు, జిల్లా అధ్యక్షురాలు గల్లా అమ్మాజీ, అనకాపల్లి అధ్యక్షురాలు కేశవభట్ల వాణిశ్రీ, శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ భరోసా కేంద్రాల చైర్మన్ బలిరెడ్డి అప్పారావు, ఉత్తరాంధ్ర జిల్లాల ఆధారంగా మిత్రమండలి కార్యదర్శి దుర్గా చైతన్య, విష్ గోపాలపట్నం కాపు సంఘం నాయకుడు గన్రెడ్డి పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దవల మోహన్, మరియు రాధా రంగా మిత్రమండలి నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పలువురు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో నిర్వహించిన రాధా–రంగా మిత్రమండలి ఆత్మీయ సమావేశం సందర్భంగా, సంస్థ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గేదెల మురళీకృష్ణ నాయుడు పై మిత్రమండలి సభ్యులు, నాయకులు విశేష నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వం సంస్థను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తుందని అభిప్రాయపడ్డారు.

మురళీకృష్ణ నాయుడు ఇప్పటివరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేయాలనే దృఢసంకల్పంతో ముందుకు సాగుతున్న ఆయన, మిత్రమండలి లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకువెళ్లే సామర్థ్యం కలిగిన నాయకుడిగా పలువురు అభివర్ణించారు.

సమావేశంలో మాట్లాడిన నాయకులు, మురళీకృష్ణ నాయుడు నాయకత్వంలో సేవా కార్యక్రమాలు విస్తృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రజలకు తోడ్పాటు అందించే కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతను, స్థానిక సమాజాన్ని కలుపుకొని ముందుకు నడిపించే శక్తి ఆయనకు ఉందని అభిప్రాయపడ్డారు.

రాధా–రంగా మిత్రమండలి లక్ష్యాలలో ఒకటైన సామాజిక ఐక్యతను బలోపేతం చేయడంలో కూడా మురళీకృష్ణ నాయుడు కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తమైంది. కుల, మత భేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొని సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే దృక్పథం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా, మిత్రమండలి విస్తరణలో భాగంగా కొత్తగా 12 మంది సభ్యులకు నియామక పత్రాలు అందజేయడం, మురళీకృష్ణ నాయుడు నాయకత్వంలో సంస్థ మరింత బలోపేతం అవుతున్నదానికి సంకేతంగా భావిస్తున్నారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర ప్రాంతంలో మిత్రమండలి ప్రభావాన్ని విస్తరించేందుకు ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగుతారని నాయకులు అభిప్రాయపడ్డారు. మొత్తంగా, గేదెల మురళీకృష్ణ నాయుడు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం రాధా–రంగా మిత్రమండలికి ఒక కొత్త దిశను నిర్దేశించిందని, ఆయన నాయకత్వంలో సంస్థ ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తుందని మిత్రమండలి సభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## బిషప్. డా. కె.ఆర్ సింగ్ నేతన్య సంఘం అధ్యక్షులు బోయపాలెం

**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 03 :**నాతన్య సంఘం బోయపాలెంలో శుభ శుక్రవా రం వేడుకలు ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలు దైవజనులు బిషప్ డాక్టర్ కేఆర్సి ధ్యానం చేస్తూ క్రీస్తు ప్రేమ క్షమాపణ దయ సమాజంలో అందరూ కలిగి ఉండా లని తన ప్రసంగంలో వివరించారు ఇవి సమాజా సంక్షేమము కలుగ చేస్తాయని తెలియపరిచారు ప్రజలందరికీ సంతోషం సమాధానం ఆరోగ్యం అభి వృద్ధి కలిగి ఉండాలని ఆశీర్వదించారు ఇం దు మూలముగా అనేక మంది వ్యక్తులు ఏసు క్రీస్తు పలికిన ఏడు మాటలు ధ్యానం చేశారు



జీకేవీధి మండలంలోని 16 పంచాయతీలకు

## ప్రత్యేక అధికారుల నియామకం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**మండలంలోని 16 పంచాయతీలలో పాలన సజావుగా కొనసాగడానికి ఆరుగురు ప్రత్యేకాధికారులను నియమించామని ఎంపీడీవో రమణబాబు శు క్రవారం వెల్లడించారు.సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున, ప్రత్యేకాధికారుల ద్వారా తాత్కాలిక పాలన వ్యవస్థను అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు.జీకేవీధి, దారకొండ, సీలేరు, దేవరపల్లి పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబును దుప్పులవాడ, గుమ్మిరేవు పంచాయతీలకు తహశీల్దార్ హెచ్.అన్నాజీరావును జర్రెల, వంచుల, మొండిగెడ్డి పంచాయతీలకు ఎంపీడీవో బిహెచ్వి రమణబాబును గాలికొండ, ఏ. దారకొండ పంచాయతీలకు పశు వైద్యాధికారి లోకుల రమేష్ ను దామనపల్లి, రింతాడ, సంకాడ పంచాయతీలకు ఆర్డబ్ల్యూఎస్ జేఈఈ కళ్యాణ్ రావును లకవరపుపేట,పెదవలస పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ ను జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పంచాయితీల ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీల పాలన సక్రమంగా సాగుతుందని ఎంపీడీవో రమణబాబు తెలిపారు.

## సప్పర్ల ఘాట్‌లో కూలిన చెట్టు రాకపోకలకు అంతరాయం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలోని సప్పర్ల సమీప ఘాట్ రోడ్డుపై శు క్రవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా ఓ పెద్ద వృక్షం నేలకూలి రాకపోకలకు అంతరాయం కలిగించింది. జీకే వీధి--సీలేరు ప్రధాన మార్గంలో చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, అకస్మాత్తుగా వీచిన బలమైన గాలులకు చెట్టు వేరు సహా విరిగి రోడ్డుపై పడిపోయింది. ఘటన సమయంలో వాహన రాకపోకలు తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. అయితే కొండ ప్రాంతమైన ఘాట్ రోడ్డు కావడంతో వాహనదారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న స్థానికులు, అటవీ శాఖ సిబ్బంది కలిసి చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేపట్టి మార్గాన్ని కొంతవరకు క్లియర్ చేసినట్లు తెలిసింది. అనంతరం రాకపోకలు క్రమంగా పునరుద్ధరించబడ్డాయి. ఇటీవల ఈదురు గాలులు, ఆకస్మిక వర్షాలు పెరుగుతున్న నేపథ్యంలో ఘాట్ రోడ్లపై ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతేనే ప్రయాణించాలంటూ అధికారులు సూచిస్తున్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదలకు భరోసా





**ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం వారి జీవితాల్లో నూతన ఆశలు నింపుతోంది. ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేద కుటుంబాలకు ప్రాణాధారంగా మారిందని ఆయన తెలిపారు. వైద్య చికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 10 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ. 6.70 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గణబాబు స్వయంగా వారి నివాసాలకు వెళ్లి అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఏపీయుపిఐడిసి డైరెక్టర్ అంగ ప్రశాంతి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దే చెక్కులు అందజేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల పట్ల చూపుతున్న బాధ్యతను ఆయన ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పేదలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలబడటమే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి సహాయ నిధిని పారదర్శకంగా మరియు వేగవంతంగా అందిస్తున్నామని తెలిపారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు.

లబ్ధిదారుల వివరాలు 58వ వార్డు సానాపతి చిన్నబాయి రూ.1,46,337, సడాని పల్లి నాగమణి రూ.30,028, 59వ వార్డు కుసుమూరు ఈశ్వరమ్మ రూ.22,000, శంకరన శంకర్ రూ.41,601, పాటూరి సత్యవతి రూ.20,000, మోటూరి చంద్ర శేఖర్ రూ.95,130, 60వ వార్డు కొత్తపల్లి సుమన్ రూ.93,543, 62వ వార్డు గంట్యాడ పోలమ్మ రూ.57,978, కంబాల చంటి రూ.1,40,000, కుర్రి అప్పారావు రూ.43,421 తమ కష్టకాలంలో ప్రభుత్వ సహాయం అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే గణబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దామనపల్లి,రింతాడ,సంకాడ పంచాయతీల ప్రత్యేక అధికారిగా కళ్యాణ్ బాబు నియామకం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని దామనపల్లి, రింతాడ, సంకాడ పంచాయతీల ప్రత్యేక అధికారిగా ఆర్డబ్ల్యూఎస్ జెఈఈ కళ్యాణ్ బాబును అధికారులు నియమించారు.ఈ సందర్భంగా కళ్యాణ్ బాబు మాట్లాడుతూ, "అధికారుల ఆదేశాల మేరకు నాకు కేటాయించిన పంచాయతీల అభివృద్ధి కోసం కృషి చేస్తాను. ప్రజల సంక్షేమం కోసం సమర్థవంతమైన పాలనను అందించేందుకు ప్రయత్నిస్తాను" అని తెలిపారు.

## గూడెంకాలనీలో ఘనంగా ఇటుకల పండుగ ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 3:** జీకేవీధి మండలంలోని గూడెంకాలనీలో గిరిజనులు అత్యంత ఇష్టంగా జరుపుకునే ఇటుకల పండుగ శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. పండుగను ప్రత్యేక పూజలతో ప్రారంభించి గ్రామంలో సాంప్రదాయాన్ని మరల జాగ్రత్తగా పాటించారు. పండుగలో పురుషులు వేటకు వెళతారు. వారికి వీర తిలకం దిద్ది, మహిళలు ఎదురొచ్చి అడవికి పంపడం వంటి సాంప్రదాయ కార్యక్రమాలు జరుగుతాయి. వారు తిరిగి వచ్చే వరకు మహిళలు రహదారులపై డబ్బులు (తాచేరు) వసూలు చేస్తారు.దాదాపు పది రోజులపాటు ఆటపాటలు, భోజనాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ సందడి కొనసాగుతుంది. స్థానిక గిరిజనులు పండుగను సజావుగా జరిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటారు.

# పేదల పొట్ట కొట్టడం అన్యాయం




- ఫుడ్ బ్యాంక్ పునరుద్ధీకరణ చెయ్యాలి
- మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

**సాలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3:** సాలూరు ప్రాంత పేద ప్రజల ఆకలి తీర్చే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఆహార కేంద్రాన్ని(ఫుడ్ బ్యాంక్)తొలగించడం అన్యాయమని మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణ బోసు బోమ్మ జంక్షన్ వద్ద పై సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ తదితరులు విలేఖరులతో మాట్లాడారు. ఆకలితో ఎంతోమంది పేద ప్రజలు అలమటించి, ఆకలి బాధతో చనిపోతున్నారని, అలాంటి వారి ఆకలిని తీర్చేందుకు సాలూరు ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2020కరోనా సమయంలో వలస కార్మికులు, నిరుపేద కుటుంబాలు ఆకలి బాధలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి వారి కోసం ఎంతో కొంతమంది ఆకలి తీర్చేవారం అవుతామన్న ఉద్దేశ్యంతో ఈ ఆహార కేంద్రాన్ని 2021లో నాటి మునిసిపల్ కమిషనర్ చూపించిన స్థలంలోనే ఏర్పాటు చేసామన్నారు. అదేవిదంగా ప్రారంభోత్సవానికి నాటి అధికార పార్టీకి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, తెలుగు దేశం పార్టీకి చెందిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మలు వచ్చి ఘనంగా ప్రారంబించారన్నారు. నాటి నుంచి నేటి వరకు మీకై మేము స్వచ్ఛంద సంస్థకు పైన పేర్కొన్న నాయకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు విధాలుగా మద్దతు ఇచ్చారన్నారు. అలాంటి ఆహార కేంద్రాన్ని ఎటువంటి నోటీసు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఆహార కేంద్రాన్ని తొలగించటం అన్యాయమన్నారు. అంతేకాకుండా ఫుడ్ కోర్టు పరికరాలను ఏం చేసారో కూడా చెప్పలేదన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ని అడిగితే సరైన సమాధానం ఇవ్వలేదని, నిరు పేదలకు సంబంధించిన విషయంలో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఆహార కేంద్రాన్ని తొలగించిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు కమిషనర్ రత్న కుమార్ రమ్మంటే తమ సంస్థ సభ్యులతో కలిసి వెళ్ళామని, పై కప్పు ఉన్న నాలుగు స్తంభాలు లేవు అని అడిగితే ఆయన దగ్గర సమాధానం లేక, కసురుకుంటూ కోపంగా మాట్లాడారన్నారు. రెండవ సారి వెళ్లి కలవగా మీ దగ్గర ఏమైనా డాక్యుమెంట్స్ ఉన్నాయా అని అడుగుతూ, అవమాన కరంగా మాట్లాడారన్నారు. అయితే మీకై మేము స్వచ్ఛంద సంస్థ ప్రజలకు తగిన సేవలను అందిస్తున్నదే తప్ప వ్యాపారం చేయట్లేదన్నారు. పేద ప్రజలకు ఒక ముద్ద నోటికి అందించడం కోసమే ఈ సంస్థ ఏర్పాటు చేసిందన్న విషయం సాలూరు ప్రజలకు తెలుసన్నారు. అటువంటి సంస్థ పేద ప్రజల కోసం గుట్టు, చప్పుడు లేకుండా ఫుడ్ కోర్టు ను తొలగించటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ముఖ్యంగా కమీషనర్ రత్నకుమార్ తీరు అభ్యంతర కరంగా ఉందన్నారు. ఏది ఏమైనప్పటికీ మా ఆహార కేంద్రాన్ని తొలగించారు, పరికరాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు, ఇప్పటికైనా వాటిని అప్పగించాలి, అంతేకాకుండా అభ్యాగ్యులకు అన్నం పెట్టేందుకు వేరే చోట స్థలాన్ని చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మీకై మేము సభ్యులు బెవర గణపతి, పసుమర్తి నరేష్, మద్దుల భార్గవ్, వేణు, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రాజకీయాల్లో చర్చనీయాంశమైన భేటీ

**విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన పశ్చిమ ఎమ్మెల్యే**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 3 :** విశాఖ విమానాశ్రయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా గణబాబు రాజనాథ్ సింగ్ కి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం విశాఖపట్నం మరియు ఉత్తరాంధ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ప్రత్యేకంగా రక్షణ రంగ ప్రాజెక్టులు, నౌకాదళ మౌలిక సదుపాయాల విస్తరణ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాల పెంపు వంటి విషయాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

విశాఖ వ్యూహాత్మక ప్రాముఖ్యతపై హామీ

కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్న రాజనాథ్ సింగ్ విశాఖపట్నం వంటి తీరప్రాంత నగరాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సమావేశంలో గణబాబు రాష్ట్రానికి కేంద్రం నుండి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు రావాల్సిన అవసరాన్ని వివరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర-రాష్ట్ర సంబంధాల నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటువంటి సమావేశాలు అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని పెంచే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జర్రేల, జోలపుట్టు సర్పంచ్ లకు ఘన సన్మానం

- జర్రెల, జోలపుట్టు పంచాయతీల అభివృద్ధి కి సర్పంచ్ ల కృషికి కొనియాడిన ప్రజలు.
- జర్రేల సర్పంచ్ బొరగం భాగ్యవతి, జోలపుట్టు సర్పంచ్ దొర నీలకంఠం.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 03.**అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల జర్రెల గ్రామ పంచాయితీ సర్పంచ్ బొరగం భాగ్యవతికు, జోలపుట్టు పంచాయితీ సర్పంచ్ దొర నీలకంఠంలకు ఆయా పంచాయతీల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జర్రెల పంచాయతీ కేంద్రంలో గల రచ్చబండ వద్ద నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో భాగ్యవతి మాట్లాడుతూ.. 2021 నవంబరు నెలలో జరిగిన బై ఎలక్షన్ లో తనకు సర్పంచ్ గా తనకు అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి వచ్చి 79 ఏళ్ల తర్వాత సర్పంచ్ గా తన హాయంలో జర్రెల పంచాయతీలో రోడ్డు సౌకర్యం, పంచాయితీ భవనం, అంగన్వాడి భవనాలు నిర్మాణం, డ్రైనేజీలు, సిసి రోడ్లు, మంచినీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో అనేక అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టమని ఆమె అన్నారు. నాలుగేళ్ల ప్రయాణాన్ని అత్యంత తృప్తిగా, నిబద్ధతతో ముగియడం ఎంతోసంతోషకరమన్నారు. పదవి ముగిసిన నిరంతరం ప్రజా సేవలో ఉంటామన్నారు. అదే విధంగా జోలపుట్టు సర్పంచ్ దొర నీలకంఠంకు బొండ్రుగూడలో పంచాయతీ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ.. తనకు ఐదు సంవత్సరాలు సర్పంచ్ గా పదవి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడానికి తోడ్పాటు అందించిన పంచాయతీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పదవి లేకున్నాను ప్రజాసేవలో ముందుకు వెళ్తానని తెలిపారు. సర్పంచ్ పంచాయితీలో చేసిన సేవలను ఎంపిటిసి బజంగి కమల, పంచాయతీ వాసులు కొనియాడారు. ఈ కార్యక్రమాలలో భగత్రం, శుక్ర, దామోదరం, సుందర్రావు, నాగరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మి, ఆనంద్, రామక్రిష్ణ, అర్జున్, రాధాకృష్ణ, సిద్దు గాసిరం, త్రినాథ్, గ్రామ నాయుడు, రఘు, పరశురామ్, డోంబ్రు, బోల్ దాస్, ప్రభాకర్,లక్మణ్, యువత, మహిళాలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రెండుసార్లు ఓడినంత మాత్రాన ప్రపంచమేమీ అంతం కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి తర్వాత, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్య రహానే జట్టు సభ్యులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ అంతం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆటగాళ్లకు ధైర్యం చెప్పాడు. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 65 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి రహానే మాట్లాడాడు. ఈ గేమ్‌లో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా పది ఓవర్ల తర్వాత బౌలర్లు అద్భుతంగా పుంజుకుని సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసిన తీరు అద్భుతమని ప్రశంసించాడు. కేకేఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మనం ప్రతిరోజూ ఏం ఆలోచిస్తామనేదే నాకు ముఖ్యం. మన ఆటగాళ్ల ప్రయత్నం ప్రశంసనీయం. మీలో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే. ఏ పరిస్థితిలోనైనా జట్టును గెలిపించగల సత్తా మీకుంది. ఆ నమ్మకాన్ని కోల్పోవద్దు" అని రహానే పేర్కొన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో తొలి బంతి నుంచే బ్యాటర్లు చూపిన పోరాట

పటిమను కూడా కెప్టెన్ మెచ్చుకున్నాడు. "ప్రపంచం మన గురించి ఏమనుకున్నా పట్టించుకోవద్దు. మనపై మనకు నమ్మకం ఉంటే చాలు" అని రహానే స్పష్టం చేశాడు. కాగా, కేకేఆర్ చరిత్రలో ఒక సీజన్‌ను వరుసగా రెండు ఓటములతో ప్రారంభించడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. కేకేఆర్ తన తర్వాతి మ్యాచ్‌లను ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.


# సన్‌రైజర్స్ కెప్టెన్సీపై చర్చ.. నాకు కూడా ఇలాగే జరిగిందంటూ ధోనీ విషయాన్ని గుర్తుచేసిన యువీ!



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. చాలాకాలంగా జట్టుతో కొనసాగుతున్న యువ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని అందరూ భావించినప్పటికీ, ఫ్రాంచైజీ యాజమాన్యం ఇషాన్ వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయం పట్ల టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ తన అసంతృప్తిని, నిరాశను బహిరంగంగా వ్యక్తం చేశాడు. అభిషేక్ శర్మకు కొన్నేళ్లుగా నెట్స్‌లో శిక్షణ ఇస్తున్న యువరాజ్ సింగ్, అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైంది కాదన్నాడు. స్పోర్ట్స్ తక్‌తో యువీ మాట్లాడుతూ... "ఈ నిర్ణయం నన్ను కాస్త నిరాశపరిచింది. ఇషాన్ కిషన్ ఎదుగుదల అంటే నాకూ ఇష్టమే. కానీ, ఒక ఆటగాడి కోణంలో ఆలోచించండి. అభిషేక్ శర్మ ఏడేళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి తన సర్వస్వాన్ని అందిస్తున్నాడు. తన రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ, ఆ జట్టును గెలిపించాడు. అలాంటి ఆటగాడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వకపోతే, అతను ఎలాంటి మానసిక స్థితితో ఆడతాడు?" అని యువరాజ్ ప్రశ్నించాడు. అయితే, ఇషాన్, అభిషేక్ మధ్య మంచి స్నేహం ఉండటం ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఈ సందర్భంగా యువరాజ్ తన కెరీర్‌లోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. "2007లో భారత జట్టులో నేను వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి సీనియర్లు ఉన్నారు. కానీ, ఎక్కడి నుంచో వచ్చి ఎంఎస్ ధోనీ కెప్టెన్ అయ్యాడు. దానికి కారణాలు ఏవైనా కావచ్చు. కొందరి తలరాతలో నాయకుడిగా ఎదగాలని రాసిపెట్టి ఉంటుంది. కానీ, ఏళ్ల తరబడి జట్టు కోసం కష్టపడిన వారికి అవకాశం రానప్పుడు ఆటగాడిగా నిరాశ కలగడం సహజం" అని వివరించాడు. ఫ్రాంచైజీ నిర్ణయంతో తాను ఏకీభవించలేనని, అయితే ఇప్పుడు నిర్ణయం జరిగిపోయిందని యువరాజ్ అన్నాడు. "రేపు హైదరాబాద్ గెలిస్తే నా మాటలు తప్పని నిరూపితం కావచ్చు. కానీ, నా అభిప్రాయం ప్రకారం వారి బౌలింగ్ చాలా బలహీనంగా ఉంది. నాయకుడిగా ఎదిగేందుకు ఐపీఎల్ గొప్ప వేదిక. అభిషేక్‌కు ఆ అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఏదేమైనా ఈ నిరాశను పక్కనపెట్టి, కెప్టెన్‌కు మద్దతు ఇస్తూ, జరిగిన అవమానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ఆడాలని అభిషేక్‌కు చెప్పాను" అని యువీ చెప్పుకొచ్చాడు.

# పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు: లాస్ట్ 7 మ్యాచుల్లో అయ్యర్ సేనదే హవా



ఐపీఎల్ 19లో భాగంగా శుక్రవారం (ఏప్రిల్ 3) చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా ఈ ఆసక్తికర పోరు జరగనుంది. టోర్నీని ఓటమితో ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్ సొంత గడ్డపై విజయంతో బోణీ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు గుజరాత్?పై ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ ఘనంగా టోర్నీని ఆరంభించింది. ఇవాళ్టి మ్యాచులో గెలుపు కోసం ఇరు జట్లు ఉత్సుకతతో ఉన్నాయి. ఇదిలా ఉంటే ఐపీఎల్?లో పంజాబ్, చెన్నై ఇప్పటి వరకు ఎన్నిసార్లు తలపడ్డాయి.. టోర్నీలో ఎవరిది పైచేయి అనే విషయం తెలుసుకుందాం.

**పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు:**

క్యాచ్ రిచ్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఇప్పటి వరకు 32 సార్లు తలపడ్డాయి. ఇందులో చెన్నై, పంజాబ్ చెరో 16 మ్యాచుల్లో విజయం సాధించి సమఉజ్జీవులుగా ఉన్నాయి.

అయితే, చివరి 7 మ్యాచులను పరిశీలిస్తే మాత్రం పూర్తిగా పంజాబ్?దే ఆధిపత్యం. చివరి ఏడు మ్యాచుల్లో పంజాబ్ ఆరుసార్లు గెలవగా.. చెన్నై ఒక మ్యాచులో మాత్రమే విజయం సాధించింది. టోర్నీలో అత్యధిక టైటిల్స్ గెలిచిన చెన్నైను ఈ చెత్త రికార్డ్ కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు చెన్నైపై ఇవాళ్టి మ్యాచులో కూడా విజయం సాధించి తమ హవా కొనసాగించాలని పంజాబ్ భావిస్తోంది.

**ఎంఏ చిదంబరం స్టేడియం పిచ్ రిపోర్ట్:**

ఎంఏ చిదంబరం స్టేడియం సాధారణంగా బ్యాటింగ్?కు అనుకూలం. ఈ పిచ్?లో యావరేజ్ స్కోర్ 173. బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకుంటే 200 నుంచి 230 పరుగులు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. దీన్నిబట్టి చూస్తే ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమనే విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. దీంతో ఈ గేమ్‌లో భారీగా పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఇక మ్యాచ్ సాగుతున్న కొద్దీ మంచు (ఐవఘ) ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన టీమ్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది.

## కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్



# కథలపై బాలయ్య ఫోకస్ మారిందా?



నందమూరి బాలకృష్ణ తన తర్వాతి సినిమాల విషయంలో రూటు మారుస్తున్నారు. వరుసగా కుర్ర దర్శకులతో సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సక్సెస్ కాంబినేషన్స్ కంటే ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కంటెంట్ ఉన్న కుర్ర మేకర్స్ కోసం ఫోకస్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నందమూరి బాలకృష్ణ ప్రయోగాలు చేయడానికి సిద్ధంగానే ఉన్నా ఆ రేంజ్ కు తగ్గట్టు కథలు సిద్ధం చేసే వారు తక్కువ.

ఇక ప్రస్తుతం కొత్త కాంబినేషన్స్ పై రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సరిపోదా శనివారం దర్శకుడు వివేకా ఆత్రేయతో ఒక క్రైమ్ థ్రిల్లర్ కథపై చర్చలు జరుపుతున్నట్లు టాక్ వచ్చింది. ఈ దర్శకుడు రజినీకాంత్ తరువాత మళ్ళీ బాలయ్యపై ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు 'నాంది' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న విజయ్ కనకమేడల, రీసెంట్ గా బాలయ్యను కలిసి ఒక పవర్‌ఫుల్ పోలీస్ స్టోరీ వినిపించినట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. బాలయ్యకు పోలీస్ డ్రెస్ వేయడమంటే మామూలు విషయం కాదు, అందులోనూ విజయ్ తీసే సినిమాలు చాలా సీరియస్ గా, రఫ్ గా ఉంటాయి కాబట్టి ఈ కాంబినేషన్ మీద క్లారిటీ రాకముందే అంచనాలు పెరిగిపోతున్నాయి. ?అయితే విజయ్ అల్లరి నరేష్ తో తీసిన సినిమా 'నాంది' సూపర్ హిట్ అయినా, ఆ తర్వాత వచ్చిన 'ఉగ్రం' మాత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు బాలయ్య లాంటి పెద్ద హీరోను ఎలా హ్యాండిల్ చేస్తారో అన్న అనుమానాలు కొందరిలో ఉన్నాయి. కానీ విజయ్ దగ్గర మంచి కంటెంట్ ఉంటే మాత్రం బాలయ్య లాంటి మాస్ హీరో దొరికితే అది ఖచ్చితంగా వెండితెరపై ఒక రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు. ?మరోవైపు బాలకృష్ణ కూడా ఇప్పుడు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. భారీ అంచనాలతో వచ్చిన 'అఖండ 2' అంతగా వర్కవుట్ కాలేదు. దీంతో కేవలం బిల్డప్ సీన్లు మాత్రమే ఉంటే సరిపోదని, కథలో దమ్ముండాలని బాలయ్య ఫిక్స్ అయ్యారు. అందుకే విజయ్ కనకమేడల చెప్పిన ఆ సీరియస్ పోలీస్ డ్రామా బాలయ్యకు నచ్చిందని, అందుకే ఈ ప్రాజెక్ట్ ఓకే అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. రొటీన్ మాస్ మసాలా కాకుండా ఏదైనా కొత్తగా ట్రై చేయాలనేది బాలయ్య ప్లాన్ కావొచ్చు.

?ప్రస్తుతానికి ఇది ఇండస్ట్రీలో నడుస్తున్న ఒక టాక్ మాత్రమే. ఇంకా అఫీషియల్ గా ఏమీ అనౌన్స్ చేయలేదు. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్ అయితే మాత్రం బాలయ్యను మరోసారి పవర్‌ఫుల్ పోలీస్ గెటప్‌లో చూడొచ్చు. విజయ్ కనకమేడల తన మార్క్ సీరియస్ కథతో బాలయ్యను ఏ రేంజ్ లో చూపిస్తారో అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ యంగ్ డైరెక్టర్ బాలయ్యను మెప్పించి షూటింగ్ మొదలుపెడతారో లేదో వేచి చూడాలి.

## శివంగి వర్మ సొగసైన లుక్స్



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965